
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శనివారం 29 నవంబరు 2025



అందరూ దరఖాస్తు చేసుకోవాలి



సొంత స్థలాలు కలిగిన వారు, పూర్తిగా ఇళ్లు లేని వారు ఈ నెలాఖరులోగా హౌసింగ్ కార్యాలయంలో గానీ, తమ సమీప సచివాలయంలో గానీ దరఖాస్తు చేసుకోవాలి. ఆవాస్ ప్లస్ సర్వేలోని వివరాల ఆధారంగానే వచ్చే ఐదేళ్లు ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తుంది. అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. గతంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు కూడా ఆవాస్ ప్లస్ సర్వేలో పాల్గొనాలి.

- రమణయ్య, డీఈ, హౌసింగ్ శాఖ, పీలేరు

సొంతింటి కల సాకారానికి..

రెండు రోజులే గడువు!

- రేపటితో ముగియనున్న ఆవాస్ ప్లస్ సర్వే
- జోరుగా సాగుతున్న లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ
- పెరగనున్న ప్రభుత్వ సాయం
- జిల్లాలో 40 వేల దరఖాస్తులు రావొచ్చని అధికారుల అంచనా

పీలేరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేదలందరికీ 2029 నాటికి సొంతిళ్లు ఉండాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని ఇటీవల సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఆ లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రభుత్వం ఇళ్లు లేని వారి కోసం సర్వే నిర్వహిస్తోంది. ఆవాస్ ప్లస్ (గ్రామీణ్) పేరిట సచివాలయ సిబ్బంది ఇంటింటి సర్వే ద్వారా లబ్ధిదారులను గుర్తిస్తున్నారు. ఇది వరకే ఆవాస్ ప్లస్ పథకం గడువు ముగిసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్రం ఈ నెలాఖరు వరకు పెంచింది. దీంతో ఈ పథకం ద్వారా లబ్ధి పొందడానికి కేవలం రెండు రోజులే మిగిలాయని, లబ్ధిదారులు తమ సచివాలయాల్లో సంప్రదించి సర్వేలో పాల్గొనాలని అధికారులు కోరుతున్నారు. ఇప్పటి వరకు పీలేరు నియోజకవర్గంలో 11,108 మంది తమకు ఇళ్లు కావాలని ఆవాస్ ప్లస్ సర్వేలో నమోదు చేసుకున్నారు. మిగిలిన రెండు రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. పనిలో పనిగా స్వంత స్థలం కలిగి ఇల్లు నిర్మించుకోలేని వారిని సైతం ప్రభుత్వం ఈ సర్వే ద్వారా గుర్తిస్తోంది. వారికి ప్రత్యేకంగా ప్రోత్సాహకాలు ప్రకటించే అవకాశం ఉంది.

ఆవాస్ ప్లస్‌తో అర్హుల లెక్క పక్కా

అర్హుల వివరాల కోసం కేంద్ర ప్రభుత్వం పీఎం ఆవాస్ ప్లస్ గ్రామీణ్ అనే పేరుతో యాప్ తీసుకువచ్చింది. ఆ యాప్‌లో అర్హుల వివరాలు మాత్రమే కాకుండా ఇంటి స్థలమున్న ప్రాంతాన్ని జియో ట్యాగింగ్ కూడా చేయాల్సి ఉంది. ఈ గడువు ఈ నెల 5వ తేదీతో ముగియగా యాప్ సరిగ్గా పనిచేయని కారణంగా వివరాలను సరిగ్గా నమోదు కాలేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు కేంద్ర ప్రభుత్వం ఈ నెలాఖరు వరకు గడువు పొడిగించింది. నెలాఖరులోపు అర్హుల వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తామని హౌసింగ్ అధికారులు చెబుతున్నారు. స్వంత స్థలం ఉన్న వారు ప్రస్తుతం అద్దె ఇంట్లో ఉన్నారా, వారి స్వంత స్థలానికి చెందిన రిజిస్ట్రేషన్ పత్రాలు, డీకేటీ అయితే దానికి సంబంధించిన అనుభవ పత్రం, జియో ట్యాగింగ్‌తో పక్కా ఆధారాలు సేకరిస్తున్నారు. ప్రభుత్వం ఇల్లు మంజూరైన తరువాత కూడా లబ్ధిదారులు అక్కడే దానిని నిర్మించుకునే విధంగా చర్యలు చేపడుతున్నారు. ఇక స్వంత స్థలాలు లేని వారికి ప్రభుత్వమే స్థలం కూడా కేటాయిస్తుంది.



పీలేరు-5 సచివాలయంలో దరఖాస్తు కోసం వచ్చిన లబ్ధిదారులు

కూటమి ప్రభుత్వంలో పెరిగిన సాయం

కేంద్ర ప్రభుత్వం ఒక ఇంటికి పట్టణాల్లో రూ.1.50 లక్షలు, గ్రామాల్లో రూ.1.59 లక్షలను యూనిట్ వ్యయంగా నిర్ణయించింది. గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలే అయినప్పటికీ దానికి అదనంగా ఉపాధి హామీ పథకం ద్వారా రూ.27 వేలు, స్వచ్ఛ భారత్ ద్వారా రూ.12 వేలు అందిస్తోంది. కూటమి ప్రభుత్వం కొలువుదీరే నాటికి రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణం దాదాపుగా నిలిచిపోయింది. దీంతో ఇళ్ల నిర్మాణాల్లో చలనం తేవడానికి ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు, ఆదివాసీ గిరిజన లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున అదనపు సాయం అందించింది. అయితే ఆ సాయానికి మరింత పెంచాలన్న ఆలోచనతో తమ ప్రభుత్వం ఉన్నట్లు ఇటీవల ముఖ్యమంత్రితో పాటు పలువురు మంత్రులు ప్రకటించారు. అది ఎంత అన్న స్పష్టత రాకపోయినప్పటికీ త్వరలోనే ప్రకటించే అవకాశం ఉంది.



పీలేరు ఆర్టీసీ నల్లగుట్టలో ఆవాస్ ప్లస్ సర్వే నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది

వైసీపీ హయాంలో ఇబ్బందులు

వైసీపీ హయాంలో కేంద్రం 73 వేల ఇళ్లు మంజూరు చేసింది. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.1.50 లక్షలతో పాటు రూ.30 వేల ఉపాధి హామీ నిధులు అందించింది. కేంద్ర ప్రభుత్వ వాటాకు వైసీపీ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా అదనంగా ఇవ్వలేదు గానీ కాలనీలకు మాత్రం జగనన్న కాలనీలు అంటూ పేరు పెట్టుకుంది. కొండల్లో, గుట్టల్లో ఇంటి స్థలాలు మంజూరు చేసి వాటిల్లో కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో అధిక శాతం లబ్ధిదారులు వాటిల్లో నిర్మాణాలను అర్థాంతరంగా నిలిపివేశారు.

రాయచోటిలో ముస్లింలకు ప్రకటన

ఇటీవల రాయచోటిలో జరిగిన గృహప్రవేశాల కార్యక్రమంలో సీఎం ముస్లిం లబ్ధిదారులకు కూడా ఎస్సీలు, బీసీల తరహాలో రూ.50 వేల అదనపు సాయాన్ని అందజేస్తామని ప్రకటించారు. ఈ అదనపు లబ్ధితో ముస్లిం లబ్ధిదారులు కూడా ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించే అవకాశం ఉంది.

పీలేరు నియోజకవర్గంలో...

పీలేరు నియోజకవర్గంలోని పీలేరు, కేవీపల్లె, కలకడ, కలికిరి, గుర్రంకొండ, వాల్మీకిపురం మండలాల్లో ఇప్పటి వరకు 1502 మంది తమకు స్వంత స్థలం ఉందని, అందులోనే ఇల్లు కట్టుకుంటామని దరఖాస్తు చేసుకున్నారు. తమకు ఎటువంటి స్థలం లేదని, ప్రభుత్వమే ఇల్లు మంజూరు చేయాలని 11,108 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇక మిగిలిన రెండు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా 40 వేల దరఖాస్తులు రావచ్చని హౌసింగ్ అధికారుల అంచనా వేస్తున్నారు. ఆ వివరాలు మండలాల వారీగా...

మండలం	సొంత స్థలం	
	ఉన్న వారు	లేని వారు
పీలేరు	244	3564
కేవీపల్లె	185	1177
కలకడ	252	1497
కలికిరి	143	1370
గుర్రంకొండ	410	1796
వాల్మీకిపురం	268	1704

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

- కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి(నేతాజీసర్కిల్), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ (08561-293006) ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 24 గంటలు సిబ్బంది ఉండేలా ఏర్పాట్లు చేశామని, సహాయక చర్యల కోసం కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

సమగ్ర శిక్ష ఏపీసీగా డాక్టర్ అనురాధ బాధ్యతలు



మర్యాదపూర్వకంగా కలెక్టర్‌ను కలిసిన ఏపీసీ అనురాధ

రాయచోటి కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్‌గా డాక్టర్ అనురాధ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, విద్యా విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ ఇటీవలే ఏపీసీగా నియమితులయ్యారు. సమగ్ర శిక్ష చైర్మన్, కలెక్టర్ నిశాంత్‌కుమార్‌ను కలిసిన అనంతరం ఆమె మాట్లాడుతూ ఐదేళ్ల పాటు పాఠశాల బోధనానుభవం ఉన్న రీత్యా క్షేత్రస్థాయిలో పాఠశాలల మీద అవగాహన ఉందన్నారు. పాఠశాలల్లో మౌళిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక శ్రద్ధ చూపుతూ విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కాగా ఈమె పదేళ్ల పాటు పద్మావతి యూనివర్శిటీలో, మూడేళ్లు ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. డీఈవో డాక్టర్ సుబ్రహ్మణ్యం ఆమెకి ఏపీసీగా బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష, జిల్లా విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

- డీఈవో సుబ్రహ్మణ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో

రాయచోటిటౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు మంచి ఆరోగ్యం చేకూరుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని నేతాజీసర్కిల్‌లో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జిల్లా సమ్మిళిత విద్య సమన్వయకర్త జనార్ధన్ ఆధ్వర్యంలో జిల్లా పారా ఒలంపిక్స్ అసోసియేషన్ సౌజన్యంతో 13-20 ఏళ్ల లోపు దివ్యాంగ పిల్లలకు క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో 30 మండలాల నుంచి దాదాపు 150 మంది దివ్యాంగ పిల్లలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరుగు, షాట్‌పుట్, జావలిన్‌త్రో, లాంగ్‌జంప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ స్థానాలకు మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం సమ్మిళిత విద్య సమన్వయకర్త జనార్ధన్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో గెలుపొందిన దివ్యాంగ పిల్లలకు మరింత శిక్షణ ఇచ్చి త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు పంపనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పారా ఒలంపిక్స్ అసోసియేషన్ చైర్మన్ శ్రీనివాసులు, కడప చైర్మన్ దామోదర్‌రెడ్డి, రాష్ట్ర వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా జనరల్ సెక్రటరీ కె.వీరాంజనేయులు, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, త్రివేణి, వ్యాయామ ఉపాధ్యాయులు నరసరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలతో సమీక్ష

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నిశాంత్‌కుమార్

రాయచోటి(నేతాజీసర్కిల్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రత్యేక సవరణ-2026, కొత్త పోలింగ్ కేంద్రాలు, మార్పులు, చేర్పులు తదితర అంశాలపై అన్ని నియోజకవర్గాల ఐఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ నిశాంత్‌కుమార్ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అధికారులకు, వివిధ రాజకీయ పార్టీలకు దిశా నిర్దేశం చేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రతి పోలింగ్ స్టేషన్‌లో గరిష్టంగా 1200 మంది ఓట్లు మాత్రమే ఉండే విధంగా రేషనలైజేషన్ ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ ఆదర్శ్ రాజేంద్రన్, మదనపల్లి, రాజంపేట సబ్‌కలెక్టర్లు చల్లా కల్యాణి, భావన, డీఆర్‌వో మధుసూదన్‌రావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆత్మహత్యాయత్నం



మదనపల్లె జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతు

మదనపల్లె అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సిబ్బంది వేధింపులతో ఓ రైతు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గుర్రంకొండ మండలంలో చోటుచేసుకుంది. బాధితుడి కుమారుడు ఆదినారాయణరెడ్డి వివరాల మేరకు.. గుర్రంకొండ మండలం, వెల్లుట్ల గ్రామం, ఇ.పసలవాండ్లపల్లెకు చెందిన వెంకటరమణారెడ్డి రెవెన్యూ గ్రామ సర్వేనెంబరు 421లోని ప్రభుత్వ భూమిలో ఒకటిన్నర ఎకరా పొలాన్ని గత 33 ఏళ్లుగా సాగుచేసుకుంటున్నాడు. ఈ భూమికి పట్టా మంజూరు చేయాలని పలుమార్లు అధికారులను ఆశ్రయించాడు. కాగా అధికారులు కాలయాపన చేస్తూ వచ్చారని, మరో దఫా ఈ నెల 17న కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు తన అనుభవంలో ఉన్న భూమికి పట్టా ఇవ్వాలని అర్జీ ఇచ్చినట్లు తెలిపాడు. ఈ క్రమంలో సంబంధిత వీఆర్వో భూమిని పరిశీలించి తనకు రూ.50 వేలు ఇస్తే త్వరగా పట్టా వచ్చేలా చూస్తానని చెప్పాడని బాధితులు ఆరోపిస్తున్నారు. డబ్బులు ఇవ్వకపోవడంతో ప్రభుత్వ స్థలాన్ని ఖాళీ చేయాలని హెచ్చరించారని, దీంతో వీఆర్వో సమక్షంలోనే తన తండ్రి పొలంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు బాధితుడు కుమారుడు వాపోయాడు. కుటుంబసభ్యులు వెంటనే బాధితున్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు గుర్రంకొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నకిలీ మద్యం కేసులో..

తంబళ్లపల్లె కోర్టుకు జనార్దన్‌రావు

- పీటీ వారెంట్‌పై నలుగురిని హాజరుపరిచిన ఎక్సైజ్ పోలీసులు
- 15 రోజులు రిమాండ్... మదనపల్లె సబ్‌జైలుకు తరలింపు



తంబళ్లపల్లె కోర్టుకు జనార్దన్‌రావును తీసుకొచ్చిన ఎక్సైజ్ పోలీసులు

ములకలచెరువు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ములకలచెరువు నకిలీ మద్యం తయారీ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దన్‌రావుతో పాటు మరో ముగ్గురు నిందితులను శుక్రవారం సాయంత్రం పీటీ వారెంట్‌పై ఎక్సైజ్ పోలీసులు తంబళ్లపల్లె జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరిచారు. దీంతో నలుగురు నిందితులకు జడ్జి ఉమర్ ఫరూక్ 15 రోజులు రిమాండ్ విధించి నిందితులను మదనపల్లె సబ్‌జైలుకు తరలించారు. ములకలచెరువు కేంద్రంగా జరిగిన నకిలీ మద్యం తయారీ గుట్టును గత నెల 3న ఎక్సైజ్ అధికారులు రట్టు చేశారు. ఈ కేసులో ఏ1 నిందితుడిగా ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంకు చెందిన అద్దేపల్లె జనార్దన్‌రావు ఉన్నాడు. అలాగే ఇబ్రహీంపట్నంలోనూ నకిలీ మద్యం తయారీ కేంద్రంపై కూడా దాడులు జరపగా, ఈ కేసులో కూడా ఇతనే ప్రధాన నిందితుడు. కాగా గత 10న దక్షణాఫ్రికా నుంచి వచ్చిన జనార్దన్‌రావును ఎక్సైజ్ పోలీసులు గన్నవనం ఎయిర్‌పోర్టులో అరెస్టు చేసి నెల్లూరు కేంద్ర కారాగారానికి తరలించారు. ములకలచెరువు నకిలీ మద్యం కేసులో జనార్దన్‌రావు(ఏ1), అతని తమ్ముడు జగన్‌మోహన్‌రావు(ఏ26), తిరుమలశెట్టి శ్రీనివాసరావు(ఏ27), రమేష్‌బాబు(ఏ28), అల్లాబక్ష(ఏ29)లు నిందితులుగా ఉన్నారు. ఇబ్రహీంపట్నం కేసులో అరెస్టై రిమాండ్‌లో ఉన్న ఐదుగురిని ములకలచెరువు కేసులో అరెస్టు చూపేందుకు అనుమతి ఇవ్వాలని ఎక్సైజ్ పోలీసులు దాఖలు చేసిన పీటీ వారెంట్‌కు తంబళ్లపల్లె కోర్టు అనుమతి ఇచ్చింది. దీంతో నెల్లూరు సెంట్రల్ జైలులో ఉన్న జనార్దన్‌రావు, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, రమేష్‌బాబు, అల్లాబక్షులను ఎక్సైజ్ పోలీసులు తంబళ్లపల్లె కోర్టుకు తీసుకువచ్చారు. జనార్దన్‌రావు తమ్ముడు జగన్‌మోహన్‌రావు విజయవాడ జైలులో ఉండడంతో శనివారం తంబళ్లపల్లె కోర్టులో హాజరుపరచనున్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణకు చర్యలు

- కలెక్టర్ నిశాంత్‌కుమార్



డ్రగ్స్ వద్దు బ్రో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎస్పీలు

రాయచోటి(నేతాజీసర్కిల్), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదక ద్రవ్యాలను పూర్తి స్థాయిలో అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్ హాలులో మాదకద్రవ్యాల జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని జిల్లా రెవెన్యూశాఖ, పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఎస్పీ ధీరజ్ కునుబిల్లితో కలిసి కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాల బారిన పడకుండా వాటి వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో మత్తు మందుల విక్రయాలను కట్టడి చేసే విషయంలో తరచూ తనిఖీలు నిర్వహించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ యాంటీ డ్రగ్స్ పై జిల్లాలో ఇప్పటి వరకు 2560 అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. అక్టోబరు 10 నుంచి నవంబరు 28 వరకు 7 గంజాయి కేసులు పెట్టి, 63,515 కేజీలు సీజ్ చేసి 52 మంది నిందితులను గుర్తించామన్నారు. అనంతరం డ్రగ్స్ వద్దు బ్రో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో మదనపల్లి, రాజంపేట సబ్ కలెక్టర్లు చల్లా కల్యాణి, భావన, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ అధికారులు, జిల్లా అటవీశాఖ అధికారి, రాయచోటి, మదనపల్లి మున్సిపల్ కమిషనర్, డీఎంహెచ్‌వో, డీఈవో, వ్యవసాయశాఖ అధికారి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి డీఎస్పీ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పనులను వేగవంతం చేయండి

- జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి(నేతాజీసర్కిల్), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జలజీవన్ మిషన్‌తో రాయచోటి, పీలేరు, తంబళ్లపల్లిలోని 18 మండలాల కు తాగునీటి సరఫరా అందించే ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అధికారు లను ఆదేశించారు. శనివారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జలజీవన్ మిషన్ ప్రాజెక్టుపై గ్రామీణ నీటిసరఫరాల శాఖ, రెవెన్యూ, రహదారులు, భవనాలు తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా గ్రామీణ నీటి సరఫరాల శాఖ అధికారి సతీశ్ మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ప్రాజెక్టులో భాగంగా పీలేరు, తంబళ్లపల్లె, రాయచోటిలోని 18 మండలాలకు తాగునీటి సరఫరా ప్రాజెక్టు మొదటి ఫేస్ ఏప్రిల్ 2025లో ప్రారంభమైందని, పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఈ ప్రాజెక్టు మొదటి ఫేసులో మొత్తం 18 మండలాల్లోని 241 గ్రామ పంచాయతీలకు నీటి సరఫరా అందించనున్నామన్నారు. గండికోట రిజర్వాయర్ ద్వారా 1.683 టీఎంసీల నీటిని, వెలిగల్లు రిజర్వాయర్ ద్వారా 0.175 టీఎంసీల నీటిని కరువు ప్రాంతాలకు అందిస్తామని తెలిపారు. జేసీ మాట్లాడుతూ గండికోట, వెలిగల్లు రిజర్వాయర్ల ద్వారా కరువు ప్రాంతాలకు తాగునీటిని అందించేందుకు రూ.2370 కోట్లతో ఏప్రిల్ 2025లో ప్రారంభించబడిన వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు అక్టోబరు 2027 కల్లా పూర్తిచేసే విధంగా చర్యలు వేగవంతం చేయాలన్నారు. అన్నిశాఖలవారు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి సబ్ కలెక్టర్ కల్యాణి, రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి సతీశ్‌కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, గ్రామీణ నీటి సరఫరాలశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటను జిల్లా కేంద్రం చేయండి

- మోకాళ్లపై కూర్చొని జేఏసీ నిరసన



రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని మోకాళ్లపై కూర్చొని డిమాండ్ చేస్తున్న జేఏసీ నేతలు

రాజంపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాజంపేటను అన్నమయ్య జిల్లా కేంద్రం చేయాలంటే జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. మదనపల్లె జిల్లాను ఏర్పాటు చేసిన తర్వాత అన్నమయ్య జిల్లా ప్రధాన కూడలి అయిన రాజంపేటను జిల్లా కేంద్రం చేయకపోవడం పట్ల ఆందోళనలు తీవ్రతరం చేస్తామని పేర్కొన్నారు. అతి చిన్న జిల్లాలో రాయచోటికి, కోడూరుకు మధ్యలో మూడు నియోజక వర్గాలకు సౌలభ్యంగా ఉండే రాజంపేటను చేయకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు రాజంపేటలో జిల్లా సాధన సమితి జేఏసీ నాయకులు ఆధ్వర్యంలో మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. రాజంపేటను జిల్లా కేంద్రం చేయాలని డిమాండ్ నినాదాలు చేశారు. తదనంతరం జేఏసీ నాయకులు ఉద్యమ కార్యాచరణ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని అర్హతులుండి భౌగోళికంగా అందరికి అందుబాటులో ఉండే రాజం పేటను కచ్చితంగా జిల్లా కేంద్రం చేయాలని, చేస్తారని తాము నమ్ముతున్నట్లు ఆశాభావం వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో రాజంపేటకు అన్యాయం జరిగిందని, ఇప్పుడు కూడా అన్యాయం జరగడం తగదన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ తమ సమంజసమైన డిమాండ్‌ను ఆలోచించి జిల్లా కేంద్రాన్ని రాజంపేటలో ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజంపేటలో జిల్లా సాధన సమితి జేఏసీ నాయకులు ప్రభాకర్‌నాయుడు, లక్ష్మీనారాయణ, గీతాంజలి రమణ, కాంగ్రెస్ నేత పూల విజయభాస్కర్, సీనియర్ టీడీపీ నాయకులు బాసినేని వెంకటేశ్వర్లునాయుడు, మైనార్టీ నేత అబూబకర్, బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చ నాయకులు షబ్బీర్ అహ్మద్, జనసేన నేత, మాజీ జడ్పీటీసీ యల్లటూరు శివరామరాజు, జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు సమ్మెట శివప్రసాద్, సుబ్రమణ్యంనాయుడు, ప్రైవేటు పాఠశాలల సంఘ నాయకులు రవీంద్ర, సీపీఎం చిట్వేలి రవికుమార్, సీపీఐ సికిందర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల లోగిళ్లు.. సంక్షేమ హాస్టళ్లు

- చలి, దోమల బెడదతో విద్యార్థుల ఇక్కట్లు
- కనీస వసతులు కరువు
- పట్టించుకోని సంక్షేమశాఖ అధికారులు

రాయచోటిటౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సంక్షేమ హాస్టల్స్ సమస్యలకు లోగిళ్లుగా మారాయి. వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులు ఒక పక్క దోమల బెడద, మరోపక్క చలికి గజ గజ వణికిపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా చాలా వసతి గృహాల్లో కనీస వసతులు లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. పాలకులు మారినా వసతి గృహాల్లో తీరు మారలేదని విద్యార్థులు, తల్లి దండ్రులు ఆందోళన చెందుతున్నారు.

పేద విద్యార్థులకు మెరుగైన వసతితో కూడిన విద్యను, నాణ్యమైన భోజనాన్ని అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం పట్టణ, మండల ప్రాంతాల్లో వసతి గృహాలను ఏర్పాటు చేసింది. మారుమూల గ్రామాలకు చెందిన పేద విద్యార్థులు హాస్టల్‌లో ఉంటూ చదువుకునే వెలుసుబాటును కల్పించింది. అయితే పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతూ వస్తోంది. దీనికి తోడు రోజురోజుకు రెసిడెన్షియల్ విద్యకు ప్రాధాన్యతను ఇచ్చి వసతి గృహాలను నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో జిల్లాలో పేద విద్యార్థులు ఉంటున్న ప్రభుత్వ వసతి గృహాల్లో కనీసం మౌలిక వసతులు కరువయ్యాయి. ఫలితంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టల్స్‌లో ఉంటున్న పేద విద్యార్థులు పలు రకాల సమస్యలను ఎదుర్కొంటున్నారని చెప్పడంలో సందేహం లేదు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఎస్సీ సంక్షేమశాఖలో 55 వసతి గృహాలు ఉండగా అందులో సుమారు 4500 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో 6 హాస్టల్స్ అద్దె భవనాల్లో, మిగిలిన వసతి గృహాలు సొంత భవనాల్లో నడుస్తున్నాయి. ఇటీవల కాలంలో మదనపల్లె, పీలేరు, రాయచోటి ప్రాంతాల్లో హాస్టళ్లకు మరమ్మతు చేపట్టారు. ముఖ్యంగా రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి నియోజకవర్గంలోని చిన్నమండెం ప్రాంతాల్లో చిన్న చిన్న పనులను ప్రారంభిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అలాగే జిల్లాలో గిరిజన సంక్షేమ వసతి గృహాలు 12 ఉన్నాయి. ఇందులో 2 హాస్టల్స్ అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. అలాగే జిల్లా వ్యాప్తంగా బీసీ సంక్షేమ వసతి గృహాలు 48 ఉండగా మొత్తం 3200 మంది విద్యార్థులు ఉన్నారు.


ఏడు సంవత్సరాలుగా పూర్తి గాని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవనం


శిథిలావస్థలో ఉన్న రాయచోటిలోని ఎస్సీ హాస్టల్-1 భవనం

కనీస వసతులు కరువు

రాజంపేట గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రహరీ గోడ లేదు. దీంతో పాటు మరిన్ని గృహాలకు ప్రహరీగోడ లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. రాజంపేట ఇంటిగ్రేటెడ్ గిరిజన బాలికల హాస్టల్ అద్దె భవనంలో నడుస్తోంది. ప్రభుత్వ భవనాలతో పాటు అద్దె భవనాల్లో కూడా ఎంతోకాలంగా విద్యార్థులకు సవాలక్ష సమస్యలు వెంటాడుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. అలాగే జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని బీసీ హాస్టల్, సుండుపల్లె రోడ్డులోని ఆర్ఆర్ కల్యాణ మండపం ఎదురుగా గతంలో సొంత భవనం ఉండేది. అయితే ఆ భవనం శిథిలావస్థకు చేరడంతో నూతన భవనం కోసం టెండర్లు పిలిచి భవనాన్ని ప్రారంభించారు. అయితే నూతన ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవన నిర్మాణం పనులు ప్రారంభించి సుమారు 7 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు ఆ భవన నిర్మాణ పనులు పూర్తికాకుండా ఆగిపోయాయి. అదేవిధంగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న ఎస్టీ బాలికల వసతి గృహం మరమ్మతులు చేపట్టకపోవడంతో వర్షాలు పడితే స్లాబ్ నుంచి నీరు కారుతోంది. వంట గది కూడా పూర్తిగా తడిసిపోయి పై నుంచి పెచ్చులు పడుతున్నాయని విద్యార్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వసతి గృహాల సదుపాయాల కోసం బడ్జెట్ కేటాయించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారంలో విఫలం

- లవకుమార్, ఏఐఎస్ఏ
ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వ సంక్షేమశాఖలో చదువుతున్న విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైంది. జిల్లా వ్యాప్తంగా కేజీబీవీలు, రెసిడెన్సీలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న పేద, బడుగు, బలహీన విద్యార్థులు పౌష్టికాహార లోపంతో బాధపడుతూ తీవ్రమైన రక్తహీనత సమస్య ఎదుర్కొంటున్నారు. ఇలాంటి వాటిని వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని ప్రతి సంక్షేమ హాస్టల్స్, రెసిడెన్షియల్ హాస్టల్స్‌లో కూడా వైద్య పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు కావాల్సిన మందులను పంపిణీ చేయాలి.

రూ.50 లక్షలతో మరమ్మతు చేపట్టాం

- నాగేంద్రరాజు, బీసీ సంక్షేమశాఖ అధికారి

జిల్లా వ్యాప్తంగా 22 హాస్టల్స్‌లో రూ.50 లక్షలతో మరుగుదొడ్లు, తదితర వాటికి మరమ్మతులు చేపట్టాం. ఇంకా పూర్తి స్థాయి మరమ్మతుల కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు రూ.2 కోట్ల 66 లక్షలతో ప్రణాళికలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించాం. చలికాలం దృష్ట్యా ఇటీవల బెడ్‌షీట్లు కూడా పంపిణీ చేశాం. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

1న మెగా జాబ్‌మేళా : కలెక్టర్


మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

రాయచోటి (నేతాజీ సర్కిల్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో జిల్లాలోని రాయచోటి పట్టణం శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఉద్యోగ మేళాలో దాదాపు 25 కంపెనీలు పాల్గొంటున్నాయని, జిల్లా లోని ఆసక్తి ఉన్న యువతీ యువకులు హెచ్‌టీటీపీఎస్:// జేవోబీఎం ఈఎల్ఏ.ఎంఈపీఎంఏపీ. సీవోఎం. లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసు కోవాలని తెలిపారు. వివరాలకు 7901610271, 7901610276, 79016 10324 సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ లక్ష్మీదేవి, రాయచోటి, మదనపల్లె, రాజంపేట మెప్మా సిబ్బంది, జిల్లా ఐబీ స్పెషలిస్ట్ నాగరాజు పాల్గొన్నారు.

13 కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు

మదనపల్లెటౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాను, వర్షాల నేపథ్యంలో మదనపల్లె డివిజన్‌లో 13 కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాల కారణంగా ప్రజలు ఏవైనా సమస్యలు ఎదుర్కొంటే వాటిని ఆయా మండలాల పరిధిలోని కంట్రోల్‌రూమ్‌లకు సమాచారం ఇచ్చి సహాయం పొందాలని కోరారు. కంట్రోల్ రూమ్‌ల ఫోన్ నెంబరు.... మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయం 08571-231181, మదనపల్లె మండల కార్యాలయం 9121511504, మదనపల్లె మున్సిపల్ కార్యాలయం 08571-222280, నిమ్మనపల్లె 9966206757, రామసముద్రం 9676857690, వాల్మీకిపురం 9866046879, ములకలచెరువు 98669 48533, బి.కొత్తకోట 9550667096, పెద్దతిప్పసముద్రం 9491675670, కలికిరి 9441219987, తంబళ్లపల్లె 7989833068, పెద్దమండ్యం 9491077058, కురబలకోట కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబరు 96667 61520కు ఫోన్ చేసి సహాయం పొందాలని కోరారు.

ఉపాధి కూలీలను పెంచడంలో ఎఫ్ఏలదే కీలక పాత్ర : పీడీ


ఉపాధిహామీ పథకం సిబ్బందికి సూచనలిస్తున్న పీడీ

మదనపల్లెటౌన్, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలో ఉపాధి హామీ పథకంలో కూలీలను పెంచడంలో ఫీల్డ్ అసిస్టెంట్లదే కీలక పాత్ర అని డ్వామా పీడీ వెంకటరత్నం అన్నారు. శుక్రవారం స్థానిక సీఎల్ఆర్‌సీ భవనంలో తంబళ్లపల్లె క్లస్టర్‌తో పాటు మదనపల్లె మండలానికి చెందిన ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ జిల్లాలో 25 వేల మంది ఉపాధి శ్రామికులు పనిచేయాలనేది లక్ష్యంగా చేసుకున్నామని, అన్ని మండలాల్లో కలిపితే 374 మంది ఎఫ్ఏలు వున్నారని, వీరందరికి లక్ష్యాలను నిర్దేశించామన్నారు. ప్రతి మండలంలో ఉపాధి కూలీలకు పని కల్పించడంలో విఫలమైన ముగ్గురు చొప్పున ఫీల్డ్ అసిస్టెంట్లను గుర్తించి వారికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తామన్నారు. అయినా వారి పని తీరు మెరుగుపరచుకోకుంటే వారిపై చర్యలు వుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీడీ నందకుమార్‌రెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాలల సమస్యలు పరిష్కరించండి

- ప్రైవేటు విద్యాసంస్థల రాష్ట్ర జేఏసీ కన్వీనర్


మంత్రి సత్యకుమార్‌ను కలిసి వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ నేతలు

రాయచోటిటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రైవేటు నర్సింగ్ కళాశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రైవేటు విద్యాసంస్థల జేఏసీ, ప్రైవేటు నర్సింగ్ కళాశాలల అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను విజయవాడలోని సచివాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ డాక్టర్ పాపిరెడ్డి మదన్‌మోహన్‌రెడ్డి, ప్రైవేటు నర్సింగ్ కళాశాలల అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నారెడ్డి, కార్యదర్శి ప్రభుదాస్, ఆర్థిక కార్యదర్శి నాగరాజు, నాయకులు కేఎస్ఆర్ విజయ్‌కుమార్ తదితరులు మంత్రికి సమస్యలను విన్నవించారు. బీఎస్సీ నర్సింగ్‌లో రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున సీట్లు ఖాళీగా మిగిలిపోయాయని, కళాశాలలు నష్టాలబారిన పడకుండా స్పాట్ అడ్మిషన్స్ మేనేజ్‌మెంట్ కోటా ద్వారా ఇంటర్మీడియట్ అర్హత ఆధారంగా భర్తీ చేసుకునేందుకు వెంటనే అనుమతులు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో నర్సింగ్ విద్యా వ్యవస్థను కాపాడాలంటే ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని ప్రతినిధులు స్పష్టం చేశారు.

అటల్ ప్రయోగశాలలను సమర్థవంతంగా నిర్వహించండి

రాయచోటి(నేతాజీసర్కిల్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అటల్ టింకరింగ్ ప్రయోగశాలలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఉపవిద్యాశాఖ అధికారి నాగయ్య ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. రాయచోటి పట్టణం మాసాపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన అటల్ వర్క్‌షాప్ ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. అటల్ ల్యాబ్‌లను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ వర్క్‌షాప్ నిర్వహించామని తెలిపారు. ఉపాధ్యాయులు ఇక్కడ పొందిన నైపుణ్యాలను తమ ప్రయోగశాలలో విద్యార్థులకు అందించాలని సూచించారు. అటల్ ల్యాబ్‌ల ద్వారా విద్యార్థులకు కోడింగ్, 3డీ ప్రింటింగ్, ఎలక్ట్రికల్, మెకానికల్ వంటి అంశాలను తప్పనిసరిగా నేర్పాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు వర్క్‌షాప్ హాజరు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మనోహర్‌బాబు, రీసోర్స్ టీచర్లు అజయ్, సాయి, వేణుగోపాల్‌రెడ్డి, ఆంజనేయులు, హేమంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఉపవిద్యాశాఖ అధికారి

విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతో విద్యుదాఘాతం

- ముగ్గురు యువకులకు తీవ్రగాయాలు
- ఒకరి పరిస్థితి విషమం
- ట్రాన్స్‌కో అధికారులపై కేసు నమోదు


చేతికి అందేంత ఎత్తులో ఇంటి మీదున్న 11 కేవీ విద్యుత్ వైర్లు

కలికిరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా జరిగిన విద్యుదాఘాతంతో ముగ్గురు యువకులు తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలయ్యారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా వుంది. బాధితులు అందజేసిన ఫిర్యాదు మేరకు కలికిరి పోలీసులు ఇద్దరు ఉద్యోగులపై కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని మర్రికుంటపల్లె గ్రామంలో ఒక ఇంటి నిర్మాణం పూర్తయి 26న బుధవారం గృహ ప్రవేశం కోసం ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఎ.నాగార్జున, ఉదయకుమార్, సిద్దయ్య అనే యువకులు విద్యుత్ షాకుతో తీవ్రగాయాలకు గురయ్యారు. వెంటనే గ్రామస్థులు ముగ్గురినీ స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి ఆసుపత్రిలో చేర్చారు. అందులో నాగార్జున పరిస్థితి విషమంగా తయారైంది. మరో ఇద్దరు యువకులు కోలుకుంటున్నారు. ఈ క్రమంలో విద్యుత్ శాఖ అధికారుల తీవ్ర నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని పేర్కొంటూ నాగార్జున తండ్రి వీరభద్రయ్య 27న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపైన సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు సమంజసంగా భావించి మర్రికుంటపల్లె లైన్‌మెన్ పూజారి గోపి (ఏ1), ఏఈ ముజిబుర్ రెహ్మాన్ (ఏ2)లపై ఏఎస్ఐ మహబూబ్ బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నంపై విచారణ

- రాతపరీక్ష నిర్వహించి మరీ వివరాల సేకరణ


విద్యార్థులకు రాతపరీక్ష నిర్వహిస్తున్న అధికారులు

బి.కొత్తకోట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని శంకరాపురం జడ్పీ హైస్కూల్‌లో పదవతరగతి చదువుతున్న జానకీరాణి(15) అనే విద్యార్థిని గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయడం, ఆ బాలికను మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించడం తెలిసిందే. పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు దూషించడం, తరగతి బయట నిలబెట్టి అవమానించడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేసినట్లు ప్రచారం జరగడంతో ఉన్నతాధికారులు విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. అప్పటికప్పుడు బాలిక పరిస్థితిపై ఆరా తీసిన జిల్లా అధికారులు కిందిస్థాయి అధికారులకు పలు ఆదేశాలు, సూచనలు చేశారు. డీవైఈవో లోకేశ్వర్‌రెడ్డి శుక్రవారం ఉదయాన్నే శంకరాపురం హైస్కూలుకు చేరుకొని జానకీరాణి ఘటనపై విచారణ చేపట్టారు. తదితర ప్రశ్నలతో కూడిన ప్రశ్నాపత్రాన్ని రూపొందించి తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులకు వేర్వేరుగా పరీక్ష నిర్వహించి అభిప్రాయాలను రాబట్టారు. అనంతరం విద్యార్థులను విడివిడిగా ప్రశ్నించారు. ఈ విషయమై డీవైఈవో లోకేశ్వరరెడ్డి మాట్లాడుతూ తుది నివేదికను జిల్లా అధికారులకు అందిస్తామన్నారు. చిన్నపాటి విషయాలకే విద్యార్థులు ఇలాంటి తీవ్ర నిర్ణయాలు తీసుకోవడం సరికాదని, కుటుంబాల గురించి ఆలోచించాలన్నారు. కాగా చికిత్స అనంతరం జానకీరాణి ప్రాణాపాయం నుంచి బయటపడడంతో కుటుంబీకులు, ఉపాధ్యాయులు ఊపిరిపీల్చుకున్నారు. విచారణలో బి.కొత్తకోట ఎంఈవోలు రెడ్డిశేఖర్, భీమేశ్వరాచారి, హెచ్‌ఎం మునిస్వామి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం




మాట్లాడుతున్న మండల టీడీపీ అధ్యక్షుడు షాబుద్దీన్

కలికిరి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు కలికిరిలో ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 13 ఉమ్మడి జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన దాదాపు 500 మంది విద్యార్థులు అండర్-14 విభాగంలో అర్హత సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరయ్యారు. కలికిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మూడు రోజులపాటు నిర్వహించే ఈ పోటీలను శుక్రవారం ఎంపీటీసీ రెడ్డివారి గాయత్రి, టీడీపీ మండల అధ్యక్షుడు కేఎస్ షాబుద్దీన్ ప్రారంభించారు. ఈ పోటీల్లో అర్హత సాధించే విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతారు. మొదటి రోజు పోటీల్లో అండర్-14 బాలుర విభాగంలో కృష్ణా జిల్లా జట్టుపై చిత్తూరు జిల్లా జట్టు, బాలికల విభాగంలో అనంతపురం జట్టుపై చిత్తూరు జట్టు గెలుపొందాయి. పంచాయతీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు యోగేష్‌రెడ్డి క్రీడాకారులకు వసతి, భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో మదనపల్లె డీవైఈవో లోకేశ్వర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఝాన్సీ, హ్యాండ్‌బాల్ పోటీల రాష్ట్ర పరిశీలకుడు వెంకటేశ్వరరావు, ఎంఈవో సురేశ్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు శివ, రమేష్ బాబు, ఉషారాణి, కరణానిధి, చంద్రమౌళి, చిన్నప్ప, రెడ్డివరప్రసాద్, కలికిరి హెచ్‌ఎం నటరాజన్, ఇతర హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఉపసర్పంచ్‌పై అవిశ్వాస తీర్మానం

- సబ్‌కలెక్టర్ సమక్షంలో మెజారిటీ సభ్యుల నిర్ణయం


అవిశ్వాసాన్ని నమోదు చేయిస్తున్న సబ్‌కలెక్టర్

మదనపల్లెటౌన్, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని కురవంక గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌పై వార్డు సభ్యులు అవిశ్వాస తీర్మానం ప్రకటించారు. శుక్రవారం కురవంక గ్రామ సచివాలయంలో సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి ఆధ్వర్యంలో వార్డు సభ్యులు సమావేశం నిర్వహించారు. ఇది వరకే మెజారిటీ వార్డు సభ్యులు ఉప సర్పంచ్ బైగారి భారతిపై అవిశ్వాసం ప్రకటిస్తూ సబ్‌కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా పత్రాన్ని ఇచ్చారు. ఈ క్రమంలో అందరికీ నోటీసులు పంపిన సబ్‌కలెక్టర్ వార్డు సభ్యుల సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీలో మొత్తం 12 మంది వుండగా అందులో 9 మంది వార్డు సభ్యులు అవిశ్వాసం తీసుకొస్తూ చేతులెత్తారు. వీరికి మద్దతుగా సర్పంచ్ చలపతి కూడా సంతకాలు చేశారు. దీంతో అవిశ్వాసానికి మెజారిటీ దక్కడంతో బైరాగి భారతి పదవిని వదులుకోక తప్పలేదు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ మెజారిటీ వార్డు సభ్యుల నిర్ణయాన్ని పంచాయతీరాజ్ కమిషనర్‌కు పంపుతామని, అక్కడి నుంచి వచ్చే ఉత్తర్వులను అమలు పరుస్తామన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో నాగరాజు, ఎంపీడీవో తాజ్‌మస్రూర్, పంచాయతీ కార్యదర్శులు పవన్‌కుమార్, గిరిధర్‌నాయక్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

- మరొకరికి తీవ్రగాయాలు


రవీంద్ర (ఫైల్‌ఫోటో)

కలకడ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కలకడ-గుర్రంకొండ మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు రవీంద్ర (21) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు హెచ్‌సీ అబ్దుల్‌ముజీర్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. కలకడ పంచాయతీ కొత్తపల్లి వాసి రాంబాబు కుమారుడు రవీంద్ర (21), అత్త కుమారుడు రూపేష్ (20)తో కలిసి గురువారం రాత్రి ఇంటి సరుకుల కోసం గోపాలపురానికి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా బొలెరో వాహనం ఢీకొందన్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఇరువురిని మెరుగైన చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు తిరుపతికి తరలించగా అక్కడి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రవీంద్ర శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందాడు. అపస్మారక స్థితిలో రూపేష్ చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. మృతుడి తండ్రి రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి క్రీడల్లో విద్యార్థుల విజయభేరి


విద్యార్థులను అభినందిస్తున్న డీఎస్‌డీవో

రాయచోటి టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి 69వ ఎస్‌జీఎఫ్ అండర్-17 బాల, బాలికల ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌లో జిల్లా పరిధిలోని గుర్రంకొండకు చెందిన విద్యార్థులు అసాధారణ ప్రతిభ కనబరిచారు. వ్యక్తిగత ఈవెంట్స్‌లో గుర్రంకొండ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పి.హరినాథ్‌రెడ్డి సిల్వర్, ప్రసన్నకుమార్ బ్రాంజ్, గుర్రంకొండ ఏపీఆర్ఎస్ విద్యార్థిని డి.నికిత బ్రాంజ్ మెడల్ సాధించారు. టీం అండ్ యూనియన్ ఈవెంట్స్‌లో పి.మానస, పి.గాయత్రి బ్రాంజ్ మెడల్, కె.చందు సిల్వర్ మెడల్ సాధించారు. వీరంతా మహా రాష్ట్రలోని శంభోషంనగర్‌లో జరగబోయే జాతీయ స్థాయి ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొననున్నారు. రాయచోటి పట్టణంలోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో శుక్రవారం డీఎస్డీవో చంద్ర శేఖర్ వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఖేలో ఇండియా ఫెన్సింగ్‌కోచ్ రవీంద్రనాద్, సీనియర్ అసిస్టెంట్ మస్తాన్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెనగలూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు అంగన్వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న సహాయకురాలి పోస్టులకు అర్హులైన స్థానిక మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఐసీడీఎస్ పెనగలూరు సెక్టార్ సూపర్‌వైజర్ విజయకుమారి తెలిపారు. ఇండ్లూరు-1 కేంద్రంలో బీసీ-సీ కేటగిరి, బెస్తపల్లెలో ఓసీ, తిరుమల రాజుపేట ఎస్సీ, కొత్తదామరచర్ల ఓసీ, ఆర్.అప్పారావుపేట ఓసీ మహిళలకు కేటాయించారని, 10వ తరగతి పాసైనవారికి మొదటి ప్రాధాన్యం ఉంటుందన్నారు.

జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ప్రతిభ


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ సుమిత్ర

గుర్రంకొండ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు గుర్రంకొండ జడ్పీ హైస్కూల్, బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సుమిత్ర తెలిపారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రాష్ట్రస్థాయిలో అండర్-17 బాలబాలికల విభాగంలో ఫెన్సింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గుర్రంకొండ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు నిఖిత సేబర్, చందు, గాయత్రి, మానస సిల్వర్ మెడల్, అలాగే బాలుర విభాగంలో జడ్పీ హైస్కూల్ విద్యార్థులు హరినాథ్‌రెడ్డి, ప్రసన్నకుమార్, దిలీప్ స్విలర్ మెడల్‌ను సాధించినట్లు ఖేలో ఇండియా ఫెన్సింగ్ కోచ్ రవీంద్రనాథ్ తెలిపారు. వీరు మహారాష్ట్రలోని శంభోశంనగర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

ప్రతి కేంద్రంలోనూ 'రైతన్నా మీకోసం'


రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ

రామాపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రతిరైతు సేవా కేంద్రంలోనూ రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ అన్నారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని చిట్లూరు గ్రామంలోని ప్రతి రైతు కుటుంబాన్ని సందర్శించి వ్యవసాయ, అనుబంధశాఖల ద్వారా ప్రతి స్కీమ్‌ను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగు పద్ధతుల్లో తీసుకోవాల్సిన చర్యలను రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించుటకు, అధిక దిగుబడులు సాధించుటకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగమణి, రైతుసేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.




విద్యార్థులకు పద్యాలు నేర్పిస్తున్న హయత్‌బాషా

హ్యాట్సాఫ్.. మాస్టార్

- మాతృభాషపై మమకారంతో...
- గణితంలో ట్రిక్స్ నేర్పుతూ..
- ఆకట్టుకుంటున్న హయత్ బాషా బోధన
- ట్విట్టర్ (ఎక్స్) వేదికగా మంత్రి లోకేశ్ ప్రశంసలు

హయత్‌బాషా మాస్టారికి తెలుగుభాషపై ఉన్న అభిమానం అపురూపం. దానిని పిల్లలకు నేర్పించే విధానం అందరినీ ఆకర్షిస్తోంది. చిన్ననాటి నుంచే మాతృభాషపై మమకారాన్ని పెంచేలా ఆయన విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. అలాగే గణితంలో విద్యార్థులకు భయాన్ని పోగొడుతూ సులభరీతిలో అర్థమయ్యేలా బోధన సాగిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు.



సర్వశిక్షా అభియాన్ డైరెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న హయత్‌బాషా

కొండాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లప్రొద్దుటూరు మోడల్ ప్రైమరీ స్కూల్‌లో సెకండరీ గ్రేడు టీచరుగా పనిచేస్తున్న హెచ్.ఎస్ హయత్‌బాషా వినూత్న పద్ధతులలో విద్యాబోధన సాగిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. కేవలం రెగ్యులర్ సబెక్టులకే పరిమితం కాకుండా, ఆయన తెలుగు భాష, నైతిక విలువలు, గణితంలో ఉపయోగిస్తున్న ప్రత్యేక పద్ధతులు విద్యార్థుల భవిష్యత్‌కు బలమైన పునాదులు వేస్తున్నాయి. ఈ మస్టారి కృషిని గుర్తించిన రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారాలోకేశ్ ట్విట్టర్ (ఎక్స్) వేదికగా శుక్రవారం అభినందనలు తెలిపారు.

samagraap భాషా మాస్టారి తెలుగు భాషాభిమానం చూస్తే ముచ్చటేస్తోంది. పద్యాలు,పదాలు, గేయాలు చూడకుండా అప్పజెప్పేలా పిల్లలను తయారుచేసిన వైయస్ఆర్ కడప జిల్లా, కొండాపురం మండలం, తాళ్ళ ప్రొద్దుటూరు మోడల్ ప్రైమరీ స్కూలులో సెకండరీ గ్రేడ్ టీచరుగా విధులు నిర్వర్తిస్తున్న హయత్ భాషా గారికి అభినందనలు. రెగ్యులర్ సబ్జెక్టులతోపాటు తెలుగు భాషపై అభిమానంతో బోధిస్తున్న తీరు చాలా బాగుంది. వేమన పద్యాలు, సుమతీ శతకాల ద్వారా విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు చేస్తున్న కృషి ప్రశంసనీయం. విద్యార్థులతో మేథ్స్ పజిల్స్ చేయిస్తూ, Maths made easy with "Tricks" నేర్పిస్తున్న హయత్ భాషా మాస్టారి బోధనా తీరు స్ఫూర్తి నింపుతోంది.

...నారా లోకేష్,
విద్య, ఐటీ శాఖల మంత్రి. less

మంత్రి లోకేశ్ అభినందనలు

హయత్‌బాషా స్ఫూర్తిదాయకమైన బోధన తీరును గుర్తించిన మంత్రి నారా లోకేశ్ తన ట్వీట్‌లో ' బాషా మాస్టారి తెలుగుభాషాభిమానం చూస్తే మచ్చటేస్తోంది..ఆయన బోధనా తీరు స్ఫూర్తి నింపుతోంది' అని పేర్కొన్నారు. వేమన, సుమతి శతకాల ద్వారా నైతిక విలువలు పొంపొందించే కృషిని , ట్రిక్స్ ద్వారా మ్యాథ్స్ నేర్పుతున్నందుకు ప్రత్యేకంగా ప్రశంసించారు.

జ్ఞాపకశక్తికి పదును

పద్యాలు, పదాలు, గేయాలను ఎక్కడా చూడకుండా ధారాళంగా అప్పజెప్పేలా విద్యార్థులను ఆయన తీర్చిదిద్దారు. ఈ పాఠశాలలో ఐదవ తరగతికి చెందిన నలుగురు విద్యార్థులు 100 వేమన, సుమతి పద్యాలను చూడకుండా ధారళంగా చెబుతున్నారు. మిగిలిన విద్యార్థులు కూడా ఎక్కువ పద్యాలను అలవోకగా చెబుతారు. ఇది ఆయన బోధనకు నిదర్శనం. ఇది విద్యార్థుల జాపకశక్తిని, ఉచ్చారణ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుందనడంలో అతిశయోక్తి కాదు.

నైతిక విలువలకు ప్రాధాన్యం

విద్యార్థుల్లో క్రమశిక్షణ, మంచి నడవడిక పెంపొందించడానికి ఆయన వేమన పద్యాలు, సుమతి శతకాలను బోధనాంశంలో భాగం చేశారు. కేవలం అక్షరజ్ఞానమే కాకుండా, జీవిత పాఠాలను నేర్పడానికి చేస్తున్న కృషి సర్వత్రా ప్రశంసలు అందుకుంటోంది.

గణితంలో ట్రిక్స్ నేర్పుతూ....

మాస్టారు కేవలం తెలుగు భాషకే పరిమితం కాలేదు. విద్యార్థులకు కష్టం అనిపించే గణితాన్ని సులభతరం చేశారు. తరచూ విద్యార్థులకు ప్రత్యేక ట్రిక్స్ , పజిల్స్ చేయిస్తూ గణితం పట్ల ఉన్న భయాన్ని దూరం చేస్తున్నారు. దీంతో విద్యార్థులు లెక్కలను భారంగా కాకుండా, ఒక సరదా అంశంగా భావిస్తున్నారు.



విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుంది.

చిన్నతనం నుంచే పిల్లలకు పద్యాలు నేర్పించడం ద్వారా వారిలో సృజనాత్మకత పెరుగుతుంది. నైతిక విలువలు పెరుగుతాయి. గణితంలో భయాన్ని పోగొట్టేందుకు ట్రిక్స్ ఎంతగానో ఉపయోగపడుతాయి. నా బోధనను గుర్తించిన మంత్రి నారాలోకేశ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు.
-హెచ్ఎస్ హయత్‌బాషా, సెకండరీ గ్రేడ్ టీచర్, మోడల్ ప్రైమరీ స్కూల్, తాళ్లప్రొద్దుటూరు.

చోరీ కేసులో ఐదుగురు అరెస్టు

రూ.70వేలు విలువ చేసే కాపర్ వైర్లు, బ్యాటరీలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న కడప వన్‌టౌన్ సీఐ చిన్నపెద్దయ్య

కడప క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కడప నగరం పాత బస్టాండు సమీపంలోని విశ్వం థియేటరులో కరెంటు వైర్లు, మోటర్లు చోరీ చేసిన కేసులో ఐదుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి కడప వన్‌టౌన్ సీఐ చిన్నపెద్దన్న వివరాలు తెలిపారు. కడప నగరానికి చెందిన షేక్ తబ్రీష్, షేక్ ఉమర్, షేక్ సద్దాంహుసేన్, షేక్ ముర్తుత్‌ఖాన్, షేక్ గౌసపీర్‌లు ఒక బ్యాచ్‌గా తయారయ్యారు. గత నెల వీరంతా కలిసి విశ్వం థియేటరులోని కాపర్‌వైర్లు, బ్యాటరీలు చోరీ చేశారని తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన నిందితులు శుక్రవారం గుర్రాలగడ్డ వద్ద ఉండగా వన్‌టౌన్ ఎస్ఐ ప్రతాప్ రెడ్డి సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.70వేలు విలువ చేసే కాపర్‌వైరు, రెండు బ్యాటరీలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిని రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

9 మంది జూదరుల అరెస్టు

ప్రొద్దుటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం వివేకానంద క్లాత్‌మార్కెట్ వెనుక కంపచెట్లలో జూదం ఆడుతున్న 9 మందిని అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ సదాశివయ్య, ఎస్ఐ రాఘవేంద్రారెడ్డి తెలిపారు. పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం స్థానిక టూటౌన్ పోలీసు స్టేషన్‌లో పట్టుబడిన జూదరులను చూపెట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రకాష్ నగర్‌కు చెందిన 9మంది జూదరులు పేకాట ఆడుతుండగా పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.84వేల నగదు, 8 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై గ్యాంబ్లిం గ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కోడిపుంజును మింగిన కొండచిలువ



కొండాపురం, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి): స్థానిక సీఆంఆర్ కాలనీలో గురువారం కొండ చిలువ కలకలం రేపింది. స్థానికంగా ఇళ్ల వద్ద ఉన్న కోడిపుంజును పట్టుకొని మింగుతుండగా స్థానికులు గమనించి కొండచిలువను రాళ్ల, కట్టెలతో కొట్టారు. దీంతో కొండచిలువ మృతి చెందింది. కోడిపుంజును వదిలిపెట్టినప్పటికీ అది అప్పటికే మృతి చెందింది. ఈ విషయాన్ని స్థానికులు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా, స్థానికంగా వైరల్ అయ్యింది. పక్కనే గండికోట వెనుక జలాలు ఉండటంతో తరచూ ఇళ్ల వద్దకు ఇలాంటి పాములు వచ్చి చేరుతున్నాయని, స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

కుటుంబం అదృశ్యం

ఎర్రగుంట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల పట్టణంలోని ప్రొద్దుటూరు రోడ్డు కాల్వ కట్ట సమీపంలో చరణ్ డ్రైవింగ్ స్కూల్ నడుపుతున్న నరేష్ తన కుటుంబంతో మూడురోజులుగా కనిపించడం లేదు. నరేష్ తండ్రి ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా... మహాత్మానగర్‌లో నివాసం ఉంటున్న నరేష్ కొంతకాలంగా డ్రైవింగ్ స్కూల్ నడుపుతున్నాడు. అతని ఇంటి పక్కనే తల్లిదండ్రులు కూడా మరో ఇంట్లో నివాసం ఉంటున్నారు. నరేష్‌కు భార్య భార్గవి, కుమారులు చరణ్, శ్రావణ్‌లు ఉన్నారు. బుధవారం నుంచి వారు కనిపించడం లేదని, అత్తగారి ఇంటికి వెళ్లి ఉంటారని అనుకున్నామని, అయితే అక్కడా లేరని, ఫోన్లు కూడా పనిచేయడం లేదని నరేష్ తండ్రి చంద్రాయుడు శుక్రవారం రాత్రి పోలీసులు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నరేష్ కుటుంబంతో సహా కనిపించకుండా వెళ్లడానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై ముగ్గుల పోటీలు

కడప కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవంలో భాగంగా శుక్రవారం జిల్లా వైద్య ఆరో గ్యశాఖ, ఎయిడ్స్ నియంత్రణ శాఖల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ లు, కొవ్వొత్తుల ర్యాలీలు జరిగాయి. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాకాధికారి డాక్టర్ నాగరాజు, జిల్లా అదనపు డీఎం హెచ్‌వో, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ నగిలి రవిబాబు హైరిస్క్ గ్రూపులకు చెందిన వారితో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు డిసెంబరు 1న ఎయిడ్స్ దినం సందర్భంగా బహుమతులు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డెమో భారతి, క్లస్టర్ ప్రోగ్రామ్ అధికారి భాస్కర్, దిశా టీం సభ్యులు, టీబీ యూనిట్, స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రసవత్తరంగా క్రికెట్‌మ్యాచ్‌లు



యాసిన్ సిద్ధిక్

కడప స్పోర్ట్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ అండర్-14 ఇంటర్ జోనల్ క్రికెట్ మ్యాచ్‌లు రసవత్తరంగా సాగుతున్నాయి. కేవోఆర్‌ఎం మైదానంలో సౌత్‌జోన్ విన్నర్స్, రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో టాస్ నెగ్గిన సౌత్‌జోన్ విన్నర్స్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 48.2 ఓవర్లలో కేవలం 123 పరుగులకే కుప్పకూలిం ది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్ జట్టు మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 41 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 176 పరుగులు చేసింది. ఇందులో విఘ్నేష్ 34 పరు గులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నారు. దీంతో రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు 53 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత సాధించింది.

ఏసీఏ క్రికెట్ మైదానంలో సెంట్రల్ జోన్ విన్నర్స్ రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్‌జట్ల మధ్య మ్యాచ్ సాగింది. టాస్ నెగ్గిన సెంట్రల్ జోన్ విన్నర్స్ జట్టు బ్యాటింగ్ చేపట్టి మొదటి ఇన్నింగ్స్‌లో 79.3 ఓవర్లలో 235 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఇందులో యాసిన్ సిద్ధిక్ 91 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 8 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 19 పరుగులు చేసింది.

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో రెస్ట్‌ఆఫ్ సౌత్ జోన్... రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్ల మధ్య మ్యాచ్ సాగింది. ఇందులో టాస్ నెగ్గిన రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 80.1 ఓవర్లలో 206 పరుగులు చేసి ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 9 ఓవర్లలో 1 వికెట్ నష్టపోయి 12 పరుగులు చేసింది. దీంతో నార్త్ జోన్ జట్టు మరో 194 పరుగుల వెనుకంజలో ఉంది.

జాతీయస్థాయి హాకీ పోటీలకు చరిత



పులివెందుల రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పులి వెందుల శ్రీవిద్యాధరి హైస్కూల్‌కు చెందిన ఎన్.చరిత జాతీ యస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల సీఈఓ భానుప్రకాష్ తెలిపారు. ఈనెల 22 నుంచి 25వ తేదీ వర కు తిరుపతి జిల్లా చంద్రగిరిలో 69వ స్కూల్ గేమ్స్ ఫెడ రేషన్ అండర్-14 బాలికల హాకీ టోర్నమెంట్‌లో ఎన్.చరిత అద్భుత ప్రతిభ కనబరచడంతో ఆంధ్రప్రదేశ్ అండర్-14 హాకీ జట్టుకు ఎంపికైందన్నారు. డిసెంబరు 22 నుంచి 27వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జరిగే జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14 హాకీ టోర్నమెంట్‌లో పాల్గొం టుందన్నారు. విద్యార్థిని ఎంపిక పట్ల పాఠశాల ఉపా ధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

'స్లీప్‌వెల్ బ్రాండ్ అగరబత్తులు వాడవద్దు'



గోడౌన్లను తనిఖీ చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

మైదుకూరు రూరల్/ పోరుమామిళ్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆషికాష్ కంపెనీకి చెందిన స్లీప్ వెల్ బ్రాండ్ అగరబత్తులలో ప్రాణాంతకమైన పురుగుల మందుల అవశేషాలు ఉన్నాయని, వాటిని వాడకూడదని మైదుకూరు వ్యవసాయ సంచాలకులు క్రిష్ణమూర్తి తెలిపారు. మైదుకూరు పట్టణంలోని పలు నిత్యావసర సరుకుల గోడౌన్లలో వ్యవసాయశాఖ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ అగరబత్తులలో ప్రాణాంతకమైన మేపర్ ప్లూత్రిన్ అనే పురుగుల మందుల అవశేషాలు ఉన్నట్లు మెడికల్ ల్యాబ్‌లో నిర్ధారణ అయినట్లు ఆయన తెలిపారు. మండల వ్యవసాయశాఖ అధికారి బాల గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, పోరుమామిళ్లలోని పలు సూపర్ మార్కెట్లలో వ్యవసాయాధికారులు తనిఖీలు చేశారు. ఆయా దుకాణాల్లో ఆషికాష్ కంపెనీ తయారు చేసే స్లీప్‌వెల్ అగరబత్తుల అమ్మకాలు, వాటి నిల్వలపై తనిఖీలు చేశారు.

పరిశోధన విధానాలపై సమగ్ర అవగాహన అవసరం


కడప ఎడ్యుకేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పరిశోధన విధానాలపై ప్రతి విద్యార్థికి సమగ్ర అవగాహన అవసరమని వరంగల్ ఎన్‌ఐటీ ఫ్యాకల్టీ రామచంద్రగోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం యోగి వేమన విశ్వవిద్యాలయం రీసెర్చ్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో పరిశోధకుల కోసం నిర్వహించిన రీసెర్చ్ ఓరియెంటేషన్ ప్రోగ్రామ్‌లో పేరెన్నికగన్న నిపుణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కృత్రిమ మేధా ఆధారిత పరిశోధనా సాధనాలపై విశ్లేషణాత్మకంగా మాట్లాడారు. సాహిత్య సమీక్ష, డేటా విశ్లేషణ, థీసిస్ రచనలో ఏఐ ప్రాముఖ్యతను వివరించారు. హైదరాబాద్ నాల్సార్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బుర్రా రాహుల్‌గాంధీ మాట్లాడుతూ రీసెర్చ్ మెథడాలజీపై ప్రాక్టికల్ సెషన్ నిర్వహించారు. పరిశోధనలో ఉపయోగించే సాఫ్ట్‌వేర్‌లు, విశ్లేషణాత్మక గణాంక పద్ధతులను వివరించారు. ఇంటరాక్టివ్ బోధన ద్వారా పరిశోధన రూపకల్పన, గణాంక విశ్లేషణ, ఫలితాల అర్థం చేసుకోవడంలో విద్యార్థులకు స్పష్టత అందించారు.

రైతు ద్రోహి వైఎస్ జగన్

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శశిభూషణ్‌రెడ్డి

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతన్నలను దగా చేసిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే.. అది వైసీపీ ప్రభుత్వమేనని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగల శశిభూషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వైఎంఆర్ కాలనీలోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై 8వ తేదీ రైతాంగ దినోత్సవంగా ప్రకటించిన నాటి వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చి నట్టేట ముంచిందన్నారు. రాయలసీమలో హార్టికల్చరల్ హబ్ ఏర్పాటు చేస్తామని రైతులను నమ్మించి మోసం చేసిందని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు అన్యాయం చేస్తూ 90 శాతంగా ఉన్న డ్రిప్ ఇరిగేషన్ 70 శాతానికి మాత్రమే తగ్గించి ఇచ్చిందన్నారు. ప్రస్తుత ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సన్నకారు, ఎస్సీ రైతులకు నూరు శాతం, రైతులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలను అందించామని తెలిపారు. ధాన్యం కొనుగోలులో వారంలోపు రైతులకు బకాయిలు కూటమి ప్రభుత్వం జమ చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, పి.వి.జయలక్ష్మి, కంబగిరి, వంకధార నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు కాంగ్రెస్ పార్టీలో భగ్గుమన్న విభేదాలు



సమావేశంలో ఒకరిపై ఒకరు తీవ్ర ఆరోపణలు చేసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

జమ్మలమడుగు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు కాంగ్రెస్ పార్టీలో విభేదాలు భగ్గుమన్నాయి. గతంలో పాముల బ్రహ్మానందరెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉంటూ కాంగ్రెస్ పార్టీ తరుపున ఎమ్మెల్యేగా పోటీ చేశారు. తర్వాత ముద్దనూరు మండలానికి చెందిన సింగం శివమోహన్‌రెడ్డిని నియమించారు. అప్పటి నుంచి ఆయన అప్పుడప్పుడు కాంగ్రెస్‌పార్టీ అధిష్టానం పిలుపుమేరకు సమావేశాలు నిర్వహించేవారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం జమ్మలమడుగు పట్టణంలోని పతంగే ఫంక్షన్ హాలులో పార్టీ నియోజకవర్గ సంస్థాగత నిర్మాణంపై సభా కార్యక్రమం సింగం శివమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. సమావేశానికి పలు ప్రాంతాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు పాముల బ్రహ్మానందరెడ్డిని స్టేజీపైకి పిలిచి గౌరవించలేదంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. స్టేజీపై ఉన్న నాయకులపైకి ఆరోపణలు చేశారు. తాను మూడుసార్లు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా పోటీ చేశానని, తనను నిర్లక్ష్యం చేశారన్నారు. దీంతో అక్కడున్న నాయకులు జమ్మలమడుగులో ఇన్‌చార్జిగా ఉంటూ నీవు చేసిన ఘన కార్యాలు అందరికీ తెలుసన్నారు. ఇలా మాటా మాట పెరిగి ఒకరిపై ఒక రు ఆరోపణలు చేసుకున్నారు. దీంతో సమావేశం రసాభసాగా మారింది. కార్యక్రమంలో ఎంపీ విజయ్‌వసంత్, డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి, ప్రొద్దుటూరు, పులివెందుల ప్రాంతాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

సీనియార్టీ యథాతథంగా ఉంచాలి

- భూనిర్వాసిత ఉద్యోగులకు అన్యాయం జరిగితే సహించం
- ఆర్టీపీపీ సీఈ వాసుదేవరావుకు వినతి



సీఈ వాసుదేవరావుకు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

ఎర్రగుంట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కలమల్ల వద్ద నున్న డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీకి భూములు కోల్పోయి ఉద్యోగాలు పొందిన వారి సీనియార్టీ యథాతదంగా ఉంచాలని స్థానికులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, ప్రజలతో కలిసి వారు శుక్రవారం ప్లాంట్ సీఈ వాసుదేవరావును కలిసి వినతిపత్రం ఇచ్చారు. 1988లో భూములు కోల్పోయి నిర్వాసితులైన వారికి 2013లో జీవో 98 ఇచ్చి 50శాతం ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. మిగిలిన 50శాతం రిక్రూట్‌మెంట్ ద్వారా నియమించింది. అప్పటి నుంచి భూనిర్వాసితులకు మొదటి ప్రాధాన్యతగా సీనియారిటీ అమల్లో ఉందన్నారు. అయితే తాజాగా సీనియారిటీ జాబితాను మార్పులు చేసి భూములు కోల్పోయిన ఉద్యోగుల సీనియారిటీని వెనక్కి నెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఈ విషయంలో భూనిర్వాసిత ఉద్యోగులకు అన్యాయం జరిగితే పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కలమల్ల, సున్నపురాళ్లపల్లెకు చెందిన కృష్ణబాబు, మణినాథ్‌రెడ్డి, ఐవీఎస్ఆర్, దంతం సుబ్బరామయ్య, ఎన్.తారకరామారెడ్డి, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ గడువు పెంపు

కడప కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడిటేషన్ల కాల పరిమితి ముగుస్తున్న నేపథ్యంలో కార్డుల గడువు మరో 2 నెలలు పెంచుతూ సమాచార పౌరసంబంధాలశాఖ సంచాలకులు కేఎస్ విశ్వనాథన్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. నవంబరు 30 వరకు అక్రిడిటేషన్లు గల జర్నలిస్టులకు డిసెంబరు 1 నుంచి వచ్చే ఏడాది జనవరి 31 వరకు లేదా నూతన అక్రిడిటేషన్ కార్డులు జారీ చేసే వరకు ఉత్తర్వులు అమలులో ఉంటాయన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్, డీఎంపీసీ చైర్మన్ శ్రీధర్ చెరుకూరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అక్రిడిటేషన్లు కలిగిన సంబంధిత యాజమాన్యాలు ప్రస్తుతం పనిచేస్తున్న జర్నలిస్టుల జాబితాను సమాచార పౌరసంబంధాలశాఖ కార్యాలయంలో అందజేసి పొడిగింపు స్టిక్కర్లను పొందాలని కలెక్టర్ పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారమే జనసేన అజెండా..

● రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్, తాతంశెట్టి నాగేంద్ర తదితరులు

చిట్వేలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయం సమీపంలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జనవాణి కార్యక్రమానికి భారీ స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో 103 అర్జీలు రాగా, అధికారులతో మాట్లాడి 30కి పైగా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్, తాతంశెట్టి నాగేంద్ర మాట్లాడుతూ జనవాణి కార్యక్రమం ద్వారా ప్రతి పేదవాడికి అండగా ఉండడమే జనసేన ఉద్దేశమన్నారు. రాబోవు రోజుల్లో ప్రతి మండలంలో జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల సమస్యలు పరిష్కరి స్తామనా్నరు. కార్యక్రమానికి సహకరించిన ప్రతి జనసైనికుడిని అభినందించారు. తహసీల్దారు స్పందన, ఎంపీడీవో శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ పగడాల వరలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

కోడూరు అభివృద్ధే లక్ష్యం

● కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి

రైల్వేకోడూరు, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని అభి వృద్ధి చేయడమే లక్ష్యమని రైల్వే కోడూరు నియోజకవర్గ టీడీపీ ఇన్ చార్జ్, కుడా ఛైర్మన్ ముక్కా రూపా నందరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థా నిక టీడీపీ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధిని పట్టించు కున్న పాపాన పోలేదన్నారు. డ్రైనేజీ, సి మెంటు రోడ్లు, గ్రామాలకు తారు రోడ్లు వేయిస్తున్నామన్నారు. రైల్వేకోడూరు పట్టణాన్ని ఆధునికీకరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. కోడూరు -వెంకటగిరి రోడ్డు, మూతపడిన అప్సా జ్యూస్ పరిశ్రమ, రైతు లకు శీతల గిడ్డంగులు, ఉద్యాన రైతులకు మార్కెటింగ్ సౌకర్యం, పెనగలూరులోసోమశిల వెనక జలాల లిఫ్ట్ ఇరిగేషన్ తదితర పెండింగ్ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. ఎర్రగుండ్ల జయ ప్రకాష్, పఠాన్ మౌలా, పాల్గొన్నారు.



వినతిపత్రాలు తీసుకుంటున్న ముక్కా రూపానందరెడ్డి

రైల్వేకోడూరు రూరల్: టీడీపీ బలోపే తానికి కృషి చేయాలని ముక్కా పిలుపు నిచ్చారు కోడూరులోని టీడీపీ కార్యాలయంలో పుల్లంపేట మండల కార్యకర్తలు, బూత్ లెవల్ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

భూబకాసురుల భరతం పడతాం

● టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు



ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట/ఒంటిమిట్ట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వ హయాంలో భూకబ్జాలకు పాల్పడిన వారి భరతం పడతామని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు హెచ్చరించారు. శుక్రవారం రాజంపేట టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరు మండలాలకు చెందిన ప్రజలు సుమారు 60 పైబడి వినతి పత్రాలు అంద జేశారు. ఒంటిమిట్ట మండలం, పెన్న పేరూరు, మంటపంపల్లె చుట్టు పక్కల గ్రామాల్లో వైసీపీ నాయకులు భారీ ఎత్తున భూములను కబ్జా చేయడంతోపాటు, తమను భూముల్లోకి పోనివ్వకుండా అడుకుంటున్నారని ఆ ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో వైసీపీ నాయకులు భారీ ఎత్తున భూకబ్జాలకు పాల్పడ్డారని చమర్తి దృష్టికి తెచ్చారు. ఇందుకు స్పందించిన ఆయన భూకబ్జాలపై విచారణ చేయించి, ఆ భూములను పేదలకు పంచి పెడతామన్నారు. ప్రజాదర్బార్‌లో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ నాయకుడు ఇడిమడకల కుమార్, పట్టణ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, గౌరవాధ్యక్షుడు రవికుమార్‌నాయుడు, నందలూరు మండల అధ్యక్షుడు జంగంశెట్టి సుబ్బయ్య, సిద్దవటం అధ్యక్షులు రాజశేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

వీరబల్లి, నవంబరు28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సానిపాయి పంచాయతీ ఓ నిధుల దుర్వినియోగంపై శుక్రవారం ఆ గ్రామ టీడీపీ యువ నాయకుడు నేతి రాంమోహన్, పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజకు ఫిర్యాదు చేశారు. గతంలో జరిగిన విచారణలో రూపొందించిన నివేదికపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో, ప్రస్తుతం పంచాయతీరాజ్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

వీరబల్లి, నవంబరు28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో శుక్రవారం వైద్యాధికారి మనీషా ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించి, విద్యార్థులకు కళాశాల సిబ్బందికి రక్త పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ జయరామయ్య, సూపర్‌వైజర్ శివయ్య, హెల్త్ అసిస్టెంట్ నాగయ్య, ల్యాబ్ టెక్నీషియన్ కల్పన, కళాశాల సిబ్బంది, లక్ష్మి మల్టీ స్పెషాలిటీ యాజమాన్యం పాల్గొన్నారు.

మండల కాంగ్రెస్ అధ్యక్షుడుగా పవన్‌కల్యాణ్



సిద్దవటం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా సి.ఎవన్ కల్యాణ్ నియమితులయ్యారు. శుక్రవారం రాజంపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూల భాస్కర్, డీసీసీ అధ్యక్షుడు గాజుల భాస్కర్ ఇందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

కడప ముద్దు.. రాయచోటి వద్దు

సిద్దవటం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కడపకు కూతవేటు దూరంలో ఉన్న సిద్దవటం మండలాన్ని 85 కిలోమీటర్ల దూరంలో ఉన్న అన్నమయ్య జిల్లాలో చేర్చడాన్ని నిరసిస్తూ శుక్రవారం మండల ఆటో కార్మికులు ఎంపీడీవో కార్యాలయం నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు.

అణగారిన వర్గాల ఆరాధ్య దైవం ఫూలే

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అణగారిన వర్గాల ఆరాధ్య దైవం మహాత్మా జ్యోతిరావుపూలే అని బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విజయబాస్కర్ తెలిపారు. మహాత్మా జ్యోతిరావుపూలే 135వ వర్ధంతి సందర్భంగా లక్కిరెడ్డిపల్లెలో ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయం, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఎన్నో పోరాటాలు చేసి వారిని చైతన్య పరిచి ముం దుకు నడిపిన గొప్ప సంఘ సంస్కర్త అన్నారు. ఆయన ప్రజలకు చేసిన సేవలను గుర్తించి ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం మహాత్మా అని బిరు దును ప్రదానం చేసి సన్మానించిందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు రమణ, గురుస్వామి, మార్కెట్ యార్డు డైరెక్టర్ కృష్ణ, రవిఆచారి, మండల బీజేపీ నాయకులు జయచంద్ర నాయుడు, బసయ్య, వెంకట్రమణ, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు: మహాత్మ జ్యోతిరావుపూలేను ఆదర్శంగా తీసుకోవాలని బోళాశంకర్ సేవా సమితి అధ్యక్షుడు మందల నాగేంద్ర తెలిపారు. శుక్రవారం రైల్వేకోడూరులో పూలే విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనకబడిన వర్గాలకు చేయూత నిచ్చారని, అన్ని కులాలు ఒక్కటేనంటూ దళితులకు పాఠశాల ఏర్పాటు చేసి విద్యనందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బోళాశంకర్ సేవా సంఘం సభ్యులు సీహెచ్ రమేశ్‌బాబు, నందబాల తదితరులు పాల్గొన్నారు.



రైల్వేకోడూరు: జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పిస్తున్న దృశ్యం

పట్టు పరిశ్రమతో రైతులకు మెరుగైన ఆదాయం



పట్టు పరిశ్రమలపై అవగాహన కల్పిస్తున్న డీటీ, జిల్లా అధికారులు

ఓబులవారిపల్లె, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పట్టు పరిశ్రమతో రైతులకు మంచి ఆదాయం ఉంటుందని జిల్లా పట్టు పరిశ్రమల శాఖ అధికారి డాక్టర్ వాణి తెలిపారు.రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా మల్బరీ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఒక ఎకరా పొలంలో మల్బరీ సాగు చేస్తే ఏడాదికి 2 నుంచి 3 లక్షల రూపాయలు ఆదాయం పొంద వచ్చునని తెలిపారు. ఒకసారి మల్బరి మొక్కలు నాటితే 15 ఏళ్ల వరకు దిగుబడి వస్తుందని, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొంద వచ్చునని సూచించారు. పంట సాగులో మెళకువలను మండల అధికారుల ఆధ్వర్యంలో రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల డిప్యూటీ తహసీల్దారు సిద్దేశ్వరరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరెడ్డి, ఏఎస్‌వో రమాదేవి, టెక్నికల్ అసిస్టెంట్లుసరళా, సిద్దేశ్వరి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇన్ సర్వీస్ టీచర్లను టెట్ నుంచి మినహాయించాలి

●ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడు షఫీయుల్లా



లీలాకృష్ణయ్య



లక్ష్మీకాంతమ్మ

నందలూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల కు టెట్ నుంచి మినహాయించాలని ఎస్టీయూ మండలశాఖ అధ్యక్షుడు షఫీయుల్లా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల విద్యా వనరుల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్రోపాధ్యాయ సంఘం కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం అధ్యక్షుడుగా పి.లీలాకృష్ణయ్య, ప్రధాన కార్యదర్శిగా బి.లక్ష్మీ కాంతమ్మ, ఆర్థిక కార్యదర్శిగా మార్కండేయరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరి ష్కారం కోసం కృషి చేస్తామన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

నందలూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సూచించారు. శుక్రవారం కడప రోడ్డులోని వ్యవసాయ మార్కెట్ కమిటీ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా సరైన పత్రాలను కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమని తెలిపారు. అధిక లోడు కలిగి ఉండరాదన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం నేరమని తెలిపారు. ప్రతిఒక్కరు రోడ్డు భద్రత నియమాలను పాటించాలన్నారు. సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానాలు విధించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

అంగన్వాడీలు పనివేళలు పాటించాలి

సుండుపల్లె, నవంబరు28(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కార్యకర్తలు పని వేళలు పాటించాలని సీడీపీవో రాజమ్మ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్లస్టర్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని అందజేయాలని సూచించారు. 16 నెలల నుంచి బిల్లులు అందడం లేదని, ఇలాగైతే ఏ విధంగా భోజనం చేసి పెట్టాలని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. పాలు, కోడిగుడ్లు సమయానికి అందడం లేదని సీడీపీవో దృష్టికి తీసుకువెళ్లారు.

అయ్యప్ప గురుస్వాములకు సన్మానం

రాయచోటిటౌన్, నవంబరు28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీరభద్రస్వామి ఆలయంలో శుక్రవారం మానవత సంస్థ ఛైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప గురుస్వాములను సన్మానించారు. సన్మానం అనంతరం బిక్ష ఏర్పాటు చేశారు. మాల ధరించే స్వాములకు నియమాలను తప్పకుండా ఆచరించేలా చూడాల్సిన బాధ్యత గురుస్వాములదేనన్నారు. మాల ధరించినప్పుడే కాకుండా మిగతా సమయాల్లో కూడా భక్తి భావం కలిగి ఉండాలన్నారు. హిందూతత్వంలో అయ్యప్ప మాలధారణకు ఎంతో ప్రత్యేకత ఉందని వివరించారు.

మండల అభివృద్ధికి కృషి చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ సభ్యుడు ముద్దుకృష్ణారెడ్డి

ఒంటిమిట్ట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట మండల అభివృద్ధికి ప్రతిఒక్కరు కృషి చేయాలని జడ్పీటీసీ సభ్యుడు ముద్దు కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సక్రమంగా విధులకు హాజరు కావడం లేదన్న విషయం ప్రజలు తమ దృష్టికి తీసుకు వచ్చారన్నారు. ఎక్కువ మంది సెలవులు పెడుతున్నారని అన్నారు. ఈ విషయంపై ఎంపీడీవో సుజాతమ్మ మాట్లాడుతూ సచి వాలయ సిబ్బంది సెలవులు పెడితే పంచాయతీ కార్యదర్శులు తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. గ్రామాల్లో విద్యుత్ సిబ్బంది సక్రమంగా పనిచేయడంలేదని సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకువచ్చారు. సమావేశానికి హాజరుకాని అధికారులపై ఎంపీడీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దారు దామోదర్‌రెడ్డి, ఉపాధ్యక్షురాలు గీతాదేవి, ఎంపీటీసీ సభ్యులు భాషా, నారాయణ రెడ్డి, కోఆప్షన్ మెంబర్ రఫీ, సర్పంచ్‌లు లక్ష్మీ నారాయణరెడ్డి, శివరాం, అధికారులు, పాల్గొన్నారు.

రామాపురం : మండల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని రామాపురం మండల అధ్యక్షురాలు విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం రామాపురం మండల కార్యాలయ సభాభవనంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలో ఎలాంటి సమస్యలు ఉన్నా సమాచారమందిస్తే వాటిని వీలైనంత తొందరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఎంపీడీవో జాషువా, ఆర్ఐ కృపావతి, మండల ఉపాధ్యక్షుడు రవి శంకర్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు సురేంద్రనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

సమష్టి పోరాటాలతోనే సమస్యల పరిష్కారం



బీటీఏ కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న రాష్ట్ర, జిల్లా నేతలు

రాయచోటిటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సమష్టి పోరాటాల ద్వారానే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం అవుతాయని బీటీఏ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పల్లం రామచంద్ర, జిల్లా అధ్యక్షుడు రాయచోటి రవి శంకర్ తెలిపారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని డైట్ కళాశాల ఆవరణలో బహుజన టీచర్స్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బీటీఏ జిల్లా అధ్యక్షుడు ఆర్.రవిశంకర్ అధ్యక్షతన జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బీటీఏ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పల్లం రామచంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్. అబ్దుల్‌రజాక్ ఆధ్వర్యంలో మొదటగా బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం బీటీఏ రాష్ట్ర కౌన్సిలర్లుగా రాయచోటి రవిశంకర్, షేక్. అబ్దుల్‌రజాక్, జిల్లా గౌరవాధ్యక్షుడుగా యర్రదొడ్డి మదన్ మల్‌రెడ్డి, అధ్యక్షుడుగా పల్లం రామచంద్ర, ప్రధాన కార్యదర్శిగా గోపాల్‌దాస్, రాజశేఖర్‌రెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా సీవీ రమణ, అసోసియేషన్ అధ్యక్షుడుగా ఏవీ రమణ, ఉపాధ్యక్షుడుగా గణేశ్ భూపతి, బాలిపోగు రెడ్డెయ్య, కే. సిద్దయ్య, పగడతోట రవిశంకర్, ఇండ్ల చంద్రశేఖర్, సంయుక్త కార్యదర్శిగా పఠాన్ హబీబుల్లా, కార్యదర్శులుగా అశోక్, వెంకటేశ్వర్లు, పాల రామకృష్ణ, రాజయ్య, సాకే సత్యమయ్య, దాసరిపల్లి తేజస్ క్రాంతి కుమార్, జిల్లా కౌన్సిలర్లుగా పీవీ రమణ, ఎస్వీ రమణ, చంద్రయ్య తదితరులను ఎన్నుకున్నారు. కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయులు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు ఎం. ఉత్తన్న, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు ప్రసాద్, రిటైర్డ్ ఉపాధ్యాయులు రమణ తదితరులను సన్మానించారు.

ప్లానింగ్ అప్రూవల్ ఫీజు ఆన్‌లైన్‌లోనే చెల్లించాలి



మాట్లాడుతున్న కృష్ణాసింగ్

రైల్వేకోడూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇంటి ప్లానింగ్ అప్రూవల్స్‌కు ఆన్‌లైన్ లోనే చెల్లింపులు చేయాలని కుడా ఏపీవో కృష్ణాసింగ్ తెలిపారు. కోడూరు పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనధికారిక నిర్మాణాలను క్రమబద్ధీకరించుకునేందుకు ఎల్టీటీపీల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనుమతిలేని లేఔట్లలో ప్లాట్స్ కొన్న యజమానులు ఎల్‌ఆర్‌ఎస్‌లలో రెగ్యులర్ చేసుకోవాలన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేపీవో లక్ష్మీ నారాయణమ్మ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమం.. కూటమి ప్రభుత్వ లక్ష్యం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతుల మంచి కోరే ప్రభుత్వమని రాయచోటి మార్కెట్ కమిటీ ఛైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు గడికోట సుధాకర్, గొర్లముదివేడు సొసైటీ డైరెక్టర్ జిలానీబాషా తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని వరిగ పాపిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీ బలిజపల్లెలో రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలోని టీడీపీ నేతలతో కలిసి ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వంలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. కాగా, తాగునీటి సమస్యలతో పాటు రోడ్లు, గ్రామానికి పక్కనే గల కాలువలపై రక్షణ గోడను నిర్మించాలని, ఇళ్లు లేని వారికి పక్కా గృహాలు మంజూరు చేయాలని, అక్కడున్న సమస్యలు గ్రామస్తులు వారి దృష్టికి తీసుకువచ్చారు.

కోడూరును తిరుపతి జిల్లాలో కలపాలి



మాట్లాడుతున్న రమేశ్‌బాబు

రైల్వేకోడూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కోడూరును తిరుపతి జిల్లాలో కలపాలని రాష్ట్ర గ్రీనరీ, బ్యూటిఫికేషన్ డైరెక్టర్ పుల్లెల రమేశ్‌బాబు కోరారు. శుక్రవారం రైల్వే కోడూరు పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో రైల్వేకోడూరును తిరుపతి జిల్లాలో కలపాలని అప్పటి ప్రధాని పీవీ నరసిహారావును స్థానిక నాయకులు కోరారన్నారు. తిరుపతిలో రైల్వేకోడూరును చేర్చితే విద్య, ఉద్యోగం, వైద్యం, వ్యాపారం కలసి వస్తుందన్నారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్‌లను కలసి వినతి పత్రం ఇస్తామని తెలిపారు. వైసీపీ రాజకీయ దురుద్దేశంతో రాయచోటిని జిల్లా కేంద్రం చేసిందన్నారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రతాప్‌రాజు, నాయకుడు నార్జాల హేమరాజ్ పాల్గొన్నారు.

నైతిక విలువలపై వ్యాసరచన పోటీలు

సుండుపల్లె, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నైతిక విలువలపై మానవతా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం రాయవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీ నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. సమాజంపై విద్యార్థులకు ఉన్న అవగాహనను పరీక్షించేందుకు ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. మొదటి బహుమతి మహేశ్వర్‌కు రూ.1000, ఇందు ద్వితీయ బహుమతి రూ.750, నాగవైష్ణవికి రూ.500 ప్రోత్సాహక బహుమతులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో మానవతా కన్వీనర్ కృష్ణంరాజు, జిల్లా ఆర్థిక కార్యదర్శి హరికుమార్, ఉపాధ్యక్షులు సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

రాయచోటి నేతాజీ సర్కిల్: విద్యార్థులకు నైతిక విలువలపై అవగాహన ఎంతైనా అవసరమని మానవతా సంస్థ ఛైర్మన్ అరమాటి శివగంగిరెడ్డి, ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి తెలియజేశారు. శుక్రవారం పెద్ద జంగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మానవత సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు నైతిక విలువలపై అవగాహన సదస్సు నిర్వహించారు. డైరెక్టర్లు రామచంద్రారెడ్డి, మేకల శివారెడ్డి, మాజీ అధ్యక్షులు ఖాదర్‌బాషా తదితరులు పాలొన్నారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్ అంధకారం



మత్తు పదార్థాలపై అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

పుల్లంపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మాదక ద్రవ్యాలకు బానిసైన యువత భవిష్యత్‌నుఅందకారం చేసుకుంటోందని ఇది దేశానికి చాలా ప్రమాదకరమని ఎంపీడీవో జయశ్రీ అన్నారు. శుక్రవారం స్థానిక ఎస్‌బీవీడీ సభా జూనియర్ కళాశాలలో వీహెచ్‌పీ, భజరంగదళ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నషాముక్త యువ వికసిత్ భారత్ కార్యక్రమంలో విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. రూరల్ సీఐ మస్తాన్, డాక్టర్ మనోజ్, ఎంఈవో చక్రధర్‌రాజు, ప్రిన్సిపాల్ బాలాజీరాజు, విశ్వహిందూ పరిషత్ సభ్యుడు పెంచల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిటౌన్ : మత్తు పదార్థాలతో కలిగే నష్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రసన్నకుమార్ సూచించారు. శుక్రవారం దూళ్లవారిపల్లెలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఇంటింటికి వెళ్లి మాదక ద్రవ్యాలతో కలిగే నష్టాలను ప్రజలకు వివరించారు. గుట్కా, మత్తు పానీయాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ రేఖ, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

వీరబల్లి : స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగించారు. అనంతరం వైద్యాధికారులు మనీషా, జయరాం ఆధ్వర్యంలో అంటువ్యాధులు వాటి నిర్మూలన చర్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రఘురామయ్య, భాస్కర్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

1న మెగా జాబ్‌మేళా : కలెక్టర్



మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

రాయచోటి (నేతాజీ సర్కిల్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ ఎస్‌ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో జిల్లాలోని రాయచోటి పట్టణం శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఉద్యోగ మేళాలో దాదాపు 25 కంపెనీలు పాల్గొంటున్నాయని, జిల్లా లోని ఆసక్తి ఉన్న యువతీ యువకులు హెచ్‌టీటీపీఎస్:// జేవోబీఎం ఈఎల్‌ఏ.ఎంఈపీఎంఏపీ.సీవోఎం. లింక్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసు కోవాలని తెలిపారు. వివరాలకు 7901610271, 7901610276, 79016 10324 సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మెప్మా పీడీ లక్ష్మీదేవి, రాయచోటి, మదనపల్లె, రాజంపేట మెప్మా సిబ్బంది, జిల్లా ఐబీ స్పెషలిస్ట్ నాగరాజు పాల్గొన్నారు.

13 కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు

మదనపల్లెటౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాను, వర్షాల నేపథ్యంలో మదనపల్లె డివిజన్‌లో 13 కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాల కారణంగా ప్రజలు ఏవైనా సమస్యలు ఎదుర్కొంటే వాటిని ఆయా మండలాల పరిధిలోని కంట్రోల్‌రూమ్‌లకు సమాచారం ఇచ్చి సహాయం పొందాలని కోరారు. కంట్రోల్ రూమ్‌ల ఫోన్ నెంబరు.... మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయం 08571-231181, మదనపల్లె మండల కార్యాలయం 9121511504, మదనపల్లె మున్సిపల్ కార్యాలయం 08571-222280, నిమ్మనపల్లె 9966206757, రామసముద్రం 9676857690, వాల్మీకిపురం 9866046879, ములకలచెరువు 9866948533, బి.కొత్తకోట 9550667096, పెద్దతిప్పసముద్రం 9491675670, కలికిరి 9441219987, తంబళ్లపల్లె 7989833068, పెద్దమండ్యం 9491077058, కురబలకోట కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబరు 9666761520కు ఫోన్ చేసి సహాయం పొందాలని కోరారు.

ఉపాధి కూలీలను పెంచడంలో ఎఫ్‌ఏలదే కీలక పాత్ర : పీడీ



ఉపాధిహామీ పథకం సిబ్బందికి సూచనలిస్తున్న పీడీ

మదనపల్లెటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి హామీ పథకంలో కూలీలను పెంచడంలో ఫీల్డ్ అసిస్టెంట్లదే కీలక పాత్ర అని డ్వామా పీడీ వెంకటరత్నం అన్నారు. శుక్రవారం స్థానిక సీఎల్‌ఆర్‌సీ భవనంలో తంబళ్లపల్లె క్లస్టర్‌తో పాటు మదనపల్లె మండలానికి చెందిన ఏపీవోలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ జిల్లాలో 25 వేల మంది ఉపాధి శ్రామికులు పనిచేయాలనేది లక్ష్యంగా చేసుకున్నామని, అన్ని మండలాల్లో కలిపితే 374 మంది ఎఫ్‌ఏలు వున్నారని, వీరందరికి లక్ష్యాలను నిర్దేశించామన్నారు. ప్రతి మండలంలో ఉపాధి కూలీలకు పని కల్పించడంలో విఫలమైన ముగ్గురు చొప్పున ఫీల్డ్ అసిస్టెంట్లను గుర్తించి వారికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తామన్నారు. అయినా వారి పని తీరు మెరుగుపరచుకోకుంటే వారిపై చర్యలు వుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీడీ నందకుమార్‌రెడ్డి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాలల సమస్యలు పరిష్కరించండి

● ప్రైవేటు విద్యాసంస్థల రాష్ట్ర జేఏసీ కన్వీనర్



మంత్రి సత్యకుమార్‌ను కలిసి వినతిపత్రం ఇస్తున్న అసోసియేషన్ నేతలు

రాయచోటిటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రైవేటు నర్సింగ్ కళాశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రైవేటు విద్యాసంస్థల జేఏసీ, ప్రైవేటు నర్సింగ్ కళాశాలల అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను విజయవాడలోని సచివాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ డాక్టర్ పాపిరెడ్డి మదన్‌మోహన్‌రెడ్డి, ప్రైవేటు నర్సింగ్ కళాశాలల అసోసియేషన్ అధ్యక్షుడు చెన్నారెడ్డి, కార్యదర్శి ప్రభుదాస్, ఆర్థిక కార్యదర్శి నాగరాజు, నాయకులు కేఎస్‌ఆర్ విజయ్‌కుమార్ తదితరులు మంత్రికి సమస్యలను విన్నవించారు. బీఎస్సీ నర్సింగ్‌లో రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున సీట్లు ఖాళీగా మిగిలిపోయాయని, కళాశాలలు నష్టాలబారిన పడకుండా స్పాట్ అడ్మిషన్స్, మేనేజ్‌మెంట్ కోటా ద్వారా ఇంటర్మీడియట్ అర్హత ఆధారంగా భర్తీ చేసుకునేందుకు వెంటనే అనుమతులు ఇవ్వాలని కోరారు. రాష్ట్రంలో నర్సింగ్ విద్యా వ్యవస్థను కాపాడాలంటే ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని ప్రతినిధులు స్పష్టం చేశారు.

అటల్ ప్రయోగశాలలను సమర్థవంతంగా నిర్వహించండి

రాయచోటి(నేతాజీసర్కిల్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అటల్ టింకరింగ్ ప్రయోగశాలలను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఉపవిద్యాశాఖ అధికారి నాగయ్య ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. రాయచోటి పట్టణం మాసాపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు నిర్వహించిన అటల్ వర్క్‌షాప్ ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. అటల్ ల్యాబ్‌లను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ వర్క్‌షాప్ నిర్వహించామని తెలిపారు. ఉపాధ్యాయులు ఇక్కడ పొందిన నైపుణ్యాలను తమ ప్రయోగశాలలో విద్యార్థులకు అందించాలని సూచించారు. అటల్ ల్యాబ్‌ల ద్వారా విద్యార్థులకు కోడింగ్, 3డీ ప్రింటింగ్, ఎలక్ట్రికల్, మెకానికల్ వంటి అంశాలను తప్పనిసరిగా నేర్పాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు వర్క్‌షాప్ హాజరు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మనోహర్‌బాబు, రీసోర్స్ టీచర్లు అజయ్, సాయి, వేణుగోపాల్‌రెడ్డి, ఆంజనేయులు, హేమంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉపవిద్యాశాఖ అధికారి

సమస్యల లోగిళ్లు.. సంక్షేమ హాస్టళ్లు

● చలి, దోమల బెడదతో విద్యార్థుల ఇక్కట్లు
● కనీస వసతులు కరువు
● పట్టించుకోని సంక్షేమశాఖ అధికారులు



ఏడు సంవత్సరాలుగా పూర్తి గాని ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవనం

రాయచోటిటౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సంక్షేమ హాస్టల్స్ సమస్యలకు లోగిళ్లుగా మారాయి. వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులు ఒక పక్క దోమల బెడద, మరోపక్క చలికి గజ గజ వణుకిపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా చాలా వసతి గృహాల్లో కనీస వసతులు లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. పాలకులు మారినా వసతి గృహాల్లో తీరు మారలేదని విద్యార్థులు, తల్లి దండ్రులు ఆందోళన చెందుతున్నారు.

పేద విద్యార్థులకు మెరుగైన వసతితో కూడిన విద్యను, నాణ్యమైన భోజనాన్ని అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం పట్టణ, మండల ప్రాంతాల్లో వసతి గృహాలను ఏర్పాటు చేసింది. మారుమూల గ్రామాలకు చెందిన పేద విద్యార్థులు హాస్టల్‌లో ఉంటూ చదువుకునే వెలుసుబాటును కల్పించింది. అయితే పాలకుల నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం కారణంగా వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతూ వస్తోంది. దీనికి తోడు రోజురోజుకు రెసిడెన్షియల్ విద్యకు ప్రాధాన్యతను ఇచ్చి వసతి గృహాలను నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో జిల్లాలో పేద విద్యార్థులు ఉంటున్న ప్రభుత్వ వసతి గృహాల్లో కనీసం మౌలిక వసతులు కరువయ్యాయి. ఫలితంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టల్స్‌లో ఉంటున్న పేద విద్యార్థులు పలు రకాల సమస్యలను ఎదుర్కొంటున్నారని చెప్పడంలో సందేహం లేదు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఎస్సీ సంక్షేమశాఖలో 55 వసతి గృహాలు ఉండగా అందులో సుమారు 4500 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో 6 హాస్టల్స్ అద్దె భవనాల్లో, మిగిలిన వసతి గృహాలు సొంత భవనాల్లో నడుస్తున్నాయి. ఇటీవల కాలంలో మదనపల్లె, పీలేరు, రాయచోటి ప్రాంతాల్లో హాస్టళ్లకు మరమ్మతు చేపట్టారు. ముఖ్యంగా రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి నియోజకవర్గంలోని చిన్నమండెం ప్రాంతాల్లో చిన్న చిన్న పనులను ప్రారంభిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అలాగే జిల్లాలో గిరిజన సంక్షేమ వసతి గృహాలు 12 ఉన్నాయి. ఇందులో 2 హాస్టల్స్ అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. అలాగే జిల్లా వ్యాప్తంగా బీసీ సంక్షేమ వసతి గృహాలు 48 ఉండగా మొత్తం 3200 మంది విద్యార్థులు ఉన్నారు.



శిథిలావస్థలో ఉన్న రాయచోటిలోని ఎస్సీ హాస్టల్-1 భవనం

కనీస వసతులు కరువు

రాజంపేట గిరిజన ఆశ్రమ పాఠశాలలో ప్రహరీ గోడ లేదు. దీంతో పాటు మరిన్ని గృహాలకు ప్రహరీగోడ లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. రాజంపేట ఇంటిగ్రేటెడ్ గిరిజన బాలికల హాస్టల్ అద్దె భవనంలో నడుస్తోంది. ప్రభుత్వ భవనాలతో పాటు అద్దె భవనాల్లో కూడా ఎంతోకాలంగా విద్యార్థులకు సవాలక్ష సమస్యలు వెంటాడుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. అలాగే జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని బీసీ హాస్టల్, సుండుపల్లె రోడ్డులోని ఆర్‌ఆర్ కల్యాణ మండపం ఎదురుగా గతంలో సొంత భవనం ఉండేది. అయితే ఆ భవనం శిథిలావస్థకు చేరడంతో నూతన భవనం కోసం టెండర్లు పిలిచి భవనాన్ని ప్రారంభించారు. అయితే నూతన ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవన నిర్మాణం పనులు ప్రారంభించి సుమారు 7 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు ఆ భవన నిర్మాణ పనులు పూర్తికాకుండా ఆగిపోయాయి. అదేవిధంగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న ఎస్టీ బాలికల వసతి గృహం మరమ్మతులు చేపట్టకపోవడంతో వర్షాలు పడితే స్లాబ్ నుంచి నీరు కారుతోంది. వంట గది కూడా పూర్తిగా తడిసిపోయి పై నుంచి పెచ్చులు పడుతున్నాయని విద్యార్థులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వసతి గృహాల సదుపాయాల కోసం బడ్జెట్ కేటాయించి విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

సమస్యల పరిష్కారంలో విఫలం

- లవకుమార్, ఏఐఎస్ఏ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వ సంక్షేమశాఖలో చదువుతున్న విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైంది. జిల్లా వ్యాప్తంగా కేజీబీవీలు, రెసిడెన్సీలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న పేద, బడుగు, బలహీన విద్యార్థులు పౌష్టికాహార లోపంతో బాధపడుతూ తీవ్రమైన రక్తహీనత సమస్య ఎదుర్కొంటున్నారు. ఇలాంటి వాటిని వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని ప్రతి సంక్షేమ హాస్టల్స్, రెసిడెన్షియల్ హాస్టల్స్‌లో కూడా వైద్య పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు కావాల్సిన మందులను పంపిణీ చేయాలి.

రూ.50 లక్షలతో మరమ్మతు చేపట్టాం

- నాగేంద్రరాజు, బీసీ సంక్షేమశాఖ అధికారి

జిల్లా వ్యాప్తంగా 22 హాస్టల్స్‌లో రూ.50 లక్షలతో మరుగుదొడ్లు, తదితర వాటికి మరమ్మతులు చేపట్టాం. ఇంకా పూర్తి స్థాయి మరమ్మతుల కోసం కలెక్టర్ ఆదేశాల మేరకు రూ.2 కోట్ల 66 లక్షలతో ప్రణాళికలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించాం. చలికాలం దృష్ట్యా ఇటీవల బెడ్‌షీట్లు కూడా పంపిణీ చేశాం. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.

విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతో విద్యుదాఘాతం

● ముగ్గురు యువకులకు తీవ్రగాయాలు
● ఒకరి పరిస్థితి విషమం
● ట్రాన్స్‌కో అధికారులపై కేసు నమోదు



చేతికి అందేంత ఎత్తులో ఇంటి మీదున్న 11 కేవీ విద్యుత్ వైర్లు

కలికిరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా జరిగిన విద్యుదాఘాతంతో ముగ్గురు యువకులు తీవ్ర గాయాలతో ఆసుపత్రి పాలయ్యారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా వుంది. బాధితులు అందజేసిన ఫిర్యాదు మేరకు కలికిరి పోలీసులు ఇద్దరు ఉద్యోగులపై కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని మర్రికుంటపల్లె గ్రామంలో ఒక ఇంటి నిర్మాణం పూర్తయి 26న బుధవారం గృహ ప్రవేశం కోసం ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఎ.నాగార్జున, ఉదయకుమార్, సిద్దయ్య అనే యువకులు విద్యుత్ షాకుతో తీవ్రగాయాలకు గురయ్యారు. వెంటనే గ్రామస్థులు ముగ్గురినీ స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి ఆసుపత్రిలో చేర్చారు. అందులో నాగార్జున పరిస్థితి విషమంగా తయారైంది. మరో ఇద్దరు యువకులు కోలుకుంటున్నారు. ఈ క్రమంలో విద్యుత్ శాఖ అధికారుల తీవ్ర నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరి గిందని పేర్కొంటూ నాగార్జున తండ్రి వీరభద్రయ్య 27న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపైన సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు సమంజసంగా భావించి మర్రికుంటపల్లె లైన్‌మెన్ పూజారి గోపి (ఏ1), ఏఈ ముజిబుర్ రెహ్మాన్ (ఏ2)లపై ఏఎస్‌ఐ మహబూబ్ బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న మండల టీడీపీ అధ్యక్షుడు షాబుద్దీన్

కలికిరి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు కలికిరిలో ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 13 ఉమ్మడి జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన దాదాపు 500 మంది విద్యార్థులు అండర్-14 విభాగంలో అర్హత సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరయ్యారు. కలికిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మూడు రోజులపాటు నిర్వహించే ఈ పోటీలను శుక్రవారం ఎంపీటీసీ రెడ్డివారి గాయత్రి, టీడీపీ మండల అధ్యక్షుడు కేఎస్ షాబుద్దీన్ ప్రారంభించారు. ఈ పోటీల్లో అర్హత సాధించే విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతారు. మొదటి రోజు పోటీల్లో అండర్-14 బాలుర విభాగంలో కృష్ణా జిల్లా జట్టుపై చిత్తూరు జిల్లా జట్టు, బాలికల విభాగంలో అనంతపురం జట్టుపై చిత్తూరు జట్టు గెలుపొందాయి. పంచాయతీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు యోగేష్‌రెడ్డి క్రీడాకారులకు వసతి, భోజన సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో మదనపల్లె డీవైఈవో లోకేశ్వర్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఝాన్సీ, హ్యాండ్‌బాల్ పోటీల రాష్ట్ర పరిశీలకుడు వెంకటేశ్వరరావు, ఎంఈవో సురేశ్, సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు శివ, రమేష్ బాబు, ఉషారాణి, కరణానిధి, చంద్రమౌళి, చిన్నప్ప, రెడ్డివరప్రసాద్, కలికిరి హెచ్‌ఎం నటరాజన్, ఇతర హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఉపసర్పంచ్‌పై అవిశ్వాస తీర్మానం

● సబ్‌కలెక్టర్ సమక్షంలో మెజారిటీ సభ్యుల నిర్ణయం



అవిశ్వాసాన్ని నమోదు చేయిస్తున్న సబ్‌కలెక్టర్

మదనపల్లెటౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురవంక గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌పై వార్డు సభ్యులు అవిశ్వాస తీర్మానం ప్రకటించారు. శుక్రవారం కురవంక గ్రామ సచివాలయంలో సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి ఆధ్వర్యంలో వార్డు సభ్యులు సమావేశం నిర్వహించారు. ఇది వరకే మెజారిటీ వార్డు సభ్యులు ఉప సర్పంచ్ భైగారి భారతిపై అవిశ్వాసం ప్రకటిస్తూ సబ్‌కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా పత్రాన్ని ఇచ్చారు. ఈ క్రమంలో అందరికీ నోటీసులు పంపిన సబ్‌కలెక్టర్ వార్డు సభ్యుల సమావేశం నిర్వహించారు. గ్రామ పంచాయతీలో మొత్తం 12 మంది వుండగా అందులో 9 మంది వార్డు సభ్యులు అవిశ్వాసం తీసుకొస్తూ చేతులెత్తారు. వీరికి మద్దతుగా సర్పంచ్ చలపతి కూడా సంతకాలు చేశారు. దీంతో అవిశ్వాసానికి మెజారిటీ దక్కడంతో భైరాగి భారతి పదవిని వదులుకోక తప్పలేదు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ మెజారిటీ వార్డు సభ్యుల నిర్ణయాన్ని పంచాయతీరాజ్ కమిషనర్‌కు పంపుతామని, అక్కడి నుంచి వచ్చే ఉత్తర్వులను అమలు పరుస్తామన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో నాగరాజు, ఎంపీడీవో తాజ్‌మస్రూర్, పంచాయతీ కార్యదర్శులు పవన్‌కుమార్, గిరిధర్‌నాయక్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

● మరొకరికి తీవ్రగాయాలు



రవీంద్ర (ఫైల్‌ఫోటో)

కలకడ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కలకడ-గుర్రంకొండ మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు రవీంద్ర (21) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు హెచ్‌సీ అబ్దుల్‌ముజీర్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. కలకడ పంచాయతీ కొత్తపల్లి వాసి రాంబాబు కుమారుడు రవీంద్ర (21), అత్త కుమారుడు రూపేష్ (20)తో కలిసి గురువారం రాత్రి ఇంటి సరుకుల కోసం గోపాలపురానికి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా బొలెరో వాహనం ఢీకొందన్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఇరువురిని మెరుగైన చికిత్స నిమిత్తం కుటుంబసభ్యులు తిరుపతికి తరలించగా అక్కడి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రవీంద్ర శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందాడు. అపస్మారక స్థితిలో రూపేష్ చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. మృతుడి తండ్రి రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రాష్ట్ర స్థాయి క్రీడల్లో విద్యార్థుల విజయభేరి



విద్యార్థులను అభినందిస్తున్న డీఎస్‌డీవో

రాయచోటి టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి 69వ ఎస్‌జీఎఫ్ అండర్-17 బాల, బాలికల ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌లో జిల్లా పరిధిలోని గుర్రంకొండకు చెందిన విద్యార్థులు అసాధారణ ప్రతిభ కనబరిచారు. వ్యక్తిగత ఈవెంట్స్‌లో గుర్రంకొండ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పి.హరినాథ్‌రెడ్డి సిల్వర్, ప్రసన్నకుమార్ బ్రాంజ్, గుర్రంకొండ ఏపీఆర్ఎస్ విద్యార్థిని డి.నికిత బ్రాంజ్ మెడల్ సాధించారు. టీం అండ్ యూనియన్ ఈవెంట్స్‌లో పి.మానస, పి.గాయత్రి బ్రాంజ్ మెడల్, కె.చందు సిల్వర్ మెడల్ సాధించారు. వీరంతా మహా రాష్ట్రలోని శంభోషంనగర్‌లో జరగబోయే జాతీయ స్థాయి ఫెన్సింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొననున్నారు. రాయచోటి పట్టణంలోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కార్యాలయంలో శుక్రవారం డీఎస్డీవో చంద్ర శేఖర్ వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఖేలో ఇండియా ఫెన్సింగ్‌కోచ్ రవీంద్రనాధ్, సీనియర్ అసిస్టెంట్ మస్తాన్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెనగలూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు అంగన్వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న సహాయకురాలి పోస్టులకు అర్హులైన స్థానిక మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఐసీడీఎస్ పెనగలూరు సెక్టార్ సూపర్‌వైజర్ విజయకుమారి తెలిపారు. ఇండ్లూరు-1 కేంద్రంలో బీసీ-సీ కేటగిరి, బెస్తపల్లెలో ఓసీ, తిరుమల రాజుపేట ఎస్సీ, కొత్తదామరచర్ల ఓసీ, ఆర్.అప్పారావుపేట ఓసీ మహిళలకు కేటాయించారని, 10వ తరగతి పాసైనవారికి మొదటి ప్రాధాన్యం ఉంటుందన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నంపై విచారణ

● రాతపరీక్ష నిర్వహించి మరీ వివరాల సేకరణ



విద్యార్థులకు రాతపరీక్ష నిర్వహిస్తున్న అధికారులు

బి.కొత్తకోట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని శంకరాపురం జడ్పీ హైస్కూల్‌లో పదవతరగతి చదువుతున్న జానకీరాణి(15) అనే విద్యార్థిని గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయడం, ఆ బాలికను మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించడం తెలిసిందే. పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు దూషించడం, తరగతి బయట నిలబెట్టి అవమానించడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నం చేసినట్లు ప్రచారం జరగడంతో ఉన్నతాధికారులు విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. అప్పటికప్పుడు బాలిక పరిస్థితిపై ఆరా తీసిన జిల్లా అధికారులు కిందిస్థాయి అధికారులకు పలు ఆదేశాలు, సూచనలు చేశారు. డీవైఈవో లోకేశ్వర్‌రెడ్డి శుక్రవారం ఉదయాన్నే శంకరాపురం హైస్కూలుకు చేరుకొని జానకీరాణి ఘటనపై విచారణ చేపట్టారు. తదితర ప్రశ్నలతో కూడిన ప్రశ్నాపత్రాన్ని రూపొందించి తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులకు వేర్వేరుగా పరీక్ష నిర్వహించి అభిప్రాయాలను రాబట్టారు. అనంతరం విద్యార్థులను విడివిడిగా ప్రశ్నించారు. ఈ విషయమై డీవైఈవో లోకేశ్వరరెడ్డి మాట్లాడుతూ తుది నివేదికను జిల్లా అధికారులకు అందిస్తామన్నారు. చిన్నపాటి విషయాలకే విద్యార్థులు ఇలాంటి తీవ్ర నిర్ణయాలు తీసుకోవడం సరికాదని, కుటుంబాల గురించి ఆలోచించాలన్నారు. కాగా చికిత్స అనంతరం జానకీరాణి ప్రాణాపాయం నుంచి బయటపడడంతో కుంటుంబీకులు, ఉపాధ్యాయులు ఊపిరిపీల్చుకున్నారు. విచారణలో బి.కొత్తకోట ఎంఈవోలు రెడ్డిశేఖర్, భీమేశ్వరాచారి, హెచ్‌ఎం మునిస్వామి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో ప్రతిభ



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ సుమిత్ర

గుర్రంకొండ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు గుర్రంకొండ జడ్పీ హైస్కూల్, బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సుమిత్ర తెలిపారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రాష్ట్రస్థాయిలో అండర్-17 బాలబాలికల విభాగంలో ఫెన్సింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గుర్రంకొండ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు నిఖిత సేబర్, చందు, గాయత్రి, మానస సిల్వర్ మెడల్, అలాగే బాలుర విభాగంలో జడ్పీ హైస్కూల్ విద్యార్థులు హరినాథ్‌రెడ్డి, ప్రసన్నకుమార్, దిలీప్ స్విలర్ మెడల్‌ను సాధించినట్లు ఖేలో ఇండియా ఫెన్సింగ్ కోచ్ రవీంద్రనాథ్ తెలిపారు. వీరు మహారాష్ట్రలోని శంభోశంనగర్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

ప్రతి కేంద్రంలోనూ 'రైతన్నా మీకోసం'



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ

రామాపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రతిరైతు సేవా కేంద్రంలోనూ రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ అన్నారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని చిట్లూరు గ్రామంలోని ప్రతి రైతు కుటుంబాన్ని సందర్శించి వ్యవసాయ, అనుబంధశాఖల ద్వారా ప్రతి స్కీమ్‌ను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగు పద్ధతుల్లో తీసుకోవాల్సిన చర్యలను రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని తగ్గించుటకు, అధిక దిగుబడులు సాధించుటకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగమణి, రైతుసేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పద్యాలు నేర్పిస్తున్న హయత్‌బాషా

హ్యాట్సాఫ్.. మాస్టార్


- మాతృభాషపై మమకారంతో...
- గణితంలో ట్రిక్స్ నేర్పుతూ..
- ఆకట్టుకుంటున్న హయత్ బాషా బోధన
- ట్విట్టర్ (ఎక్స్) వేదికగా మంత్రి లోకేశ్ ప్రశంసలు

హయత్‌బాషా మాస్టారికి తెలుగుభాషపై ఉన్న అభిమానం అపురూపం. దానిని పిల్లలకు నేర్పించే విధానం అందరినీ ఆకర్షిస్తోంది. చిన్ననాటి నుంచే మాతృభాషపై మమకారాన్ని పెంచేలా ఆయన విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. అలాగే గణితంలో విద్యార్థులకు భయాన్ని పోగొడుతూ సులభరీతిలో అర్థమయ్యేలా బోధన సాగిస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు.



సర్వశిక్షా అభియాన్ డైరెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న హయత్‌బాషా

కొండాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళ్లప్రొద్దుటూరు మోడల్ ప్రైమరీ స్కూల్‌లో సెకండరీ గ్రేడు టీచరుగా పనిచేస్తున్న హెచ్.ఎస్ హయత్‌బాషా వినూత్న పద్ధతులలో విద్యాబోధన సాగిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. కేవలం రెగ్యులర్ సబెక్టులకే పరిమితం కాకుండా, ఆయన తెలుగు భాష, నైతిక విలువలు, గణితంలో ఉపయోగిస్తున్న ప్రత్యేక పద్ధతులు విద్యార్థుల భవిష్యత్‌కు బలమైన పునాదులు వేస్తున్నాయి. ఈ మస్టారి కృషిని గుర్తించిన రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారాలోకేశ్ ట్విట్టర్ (ఎక్స్) వేదికగా శుక్రవారం అభినందనలు తెలిపారు.



samagraap భాషా మాస్టారి తెలుగు భాషాభిమానం చూస్తే ముచ్చటేస్తోంది. పద్యాలు,పదాలు, గేయాలు చూడకుండా అప్పజెప్పేలా పిల్లలను తయారుచేసిన వైయస్ఆర్ కడప జిల్లా, కొండాపురం మండలం, తాళ్ళప్రొద్దుటూరు మోడల్ ప్రైమరీ స్కూలులో సెకండరీ గ్రేడ్ టీచరుగా విధులు నిర్వర్తిస్తున్న హయత్ బాషా గారికి అభినందనలు. రెగ్యులర్ సబ్జెక్టులతోపాటు తెలుగు భాషపై అభిమానంతో బోధిస్తున్న తీరు చాలా బాగుంది. వేమన పద్యాలు, సుమతి శతకాల ద్వారా విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు చేస్తున్న కృషి ప్రశంసనీయం. విద్యార్థులతో మేథ్స్ పజిల్స్ చేయిస్తూ, Maths made easy with "Tricks" నేర్పిస్తున్న హయత్ బాషా మాస్టారి బోధనా తీరు స్ఫూర్తి నింపుతోంది.

...నారా లోకేష్,
విద్య, ఐటి శాఖల మంత్రి. less

మంత్రి లోకేశ్ అభినందనలు

హయత్‌బాషా స్ఫూర్తిదాయకమైన బోధన తీరును గుర్తించిన మంత్రి నారా లోకేశ్ తన ట్వీట్‌లో ' బాషా మాస్టారి తెలుగుభాషాభిమానం చూస్తే మచ్చటేస్తోంది..ఆయన బోధనా తీరు స్ఫూర్తి నింపుతోంది' అని పేర్కొన్నారు. వేమన, సుమతి శతకాల ద్వారా నైతిక విలువలు పొంపొందించే కృషిని , ట్రిక్స్ ద్వారా మ్యాథ్స్ నేర్పుతున్నందుకు ప్రత్యేకంగా ప్రశంసించారు.

జ్ఞాపకశక్తికి పదును

పద్యాలు, పదాలు, గేయాలను ఎక్కడా చూడకుండా ధారాళంగా అప్పజెప్పేలా విద్యార్థులను ఆయన తీర్చిదిద్దారు. ఈ పాఠశాలలో ఐదవ తరగతికి చెందిన నలుగురు విద్యార్థులు 100 వేమన, సుమతి పద్యాలను చూడకుండా ధారళంగా చెబుతున్నారు. మిగిలిన విద్యార్థులు కూడా ఎక్కువ పద్యాలను అలవోకగా చెబుతారు. ఇది ఆయన బోధనకు నిదర్శనం. ఇది విద్యార్థుల జ్ఞాపకశక్తిని, ఉచ్ఛారణ సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుందనడంలో అతిశయోక్తి కాదు.

నైతిక విలువలకు ప్రాధాన్యం

విద్యార్థుల్లో క్రమశిక్షణ, మంచి నడవడిక పెంపొందించడానికి ఆయన వేమన పద్యాలు, సుమతి శతకాలను బోధనాంశంలో భాగం చేశారు. కేవలం అక్షరజ్ఞానమే కాకుండా, జీవిత పాఠాలను నేర్పడానికి చేస్తున్న కృషి సర్వత్రా ప్రశంసలు అందుకుంటోంది.

గణితంలో ట్రిక్స్ నేర్పుతూ.....

మాస్టారు కేవలం తెలుగు భాషకే పరిమితం కాలేదు. విద్యార్థులకు కష్టం అనిపించే గణితాన్ని సులభతరం చేశారు. తరచూ విద్యార్థులకు ప్రత్యేక ట్రిక్స్ , పజిల్స్ చేయిస్తూ గణితం పట్ల ఉన్న భయాన్ని దూరం చేస్తున్నారు. దీంతో విద్యార్థులు లెక్కలను భారంగా కాకుండా, ఒక సరదా అంశంగా భావిస్తున్నారు.



విద్యార్థుల్లో సృజనాత్మకత పెరుగుతుంది.

చిన్నతనం నుంచే పిల్లలకు పద్యాలు నేర్పించడం ద్వారా వారిలో సృజనాత్మకత పెరుగుతుంది. నైతిక విలువలు పెరుగుతాయి. గణితంలో భయాన్ని పోగొట్టేందుకు ట్రిక్స్ ఎంతగానో ఉపయోగపడుతాయి. నా బోధనను గుర్తించిన మంత్రి నారాలోకేశ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు.
-హెచ్ఎస్ హయత్‌బాషా, సెకండరీ గ్రేడ్ టీచర్, మోడల్ ప్రైమరీ స్కూల్, తాళ్లప్రొద్దుటూరు.

చోరీ కేసులో ఐదుగురు అరెస్టు

రూ.70వేలు విలువ చేసే కాపర్ వైర్లు, బ్యాటరీలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న కడప వన్‌టౌన్ సీఐ చిన్నపెద్దయ్య

కడప క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కడప నగరం పాత బస్టాండు సమీపంలోని విశ్వం థియేటరులో కరెంటు వైర్లు, మోటర్లు చోరీ చేసిన కేసులో ఐదుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి కడప వన్‌టౌన్ సీఐ చిన్నపెద్దన్న వివరాలు తెలిపారు. కడప నగరానికి చెందిన షేక్ తబ్రీష్, షేక్ ఉమర్, షేక్ సద్దాంహుసేన్, షేక్ ముర్తుత్‌ఖాన్, షేక్ గౌస్‌పీర్‌లు ఒక బ్యాచ్‌గా తయారయ్యారు. గత నెల వీరంతా కలిసి విశ్వం థియేటరులోని కాపర్‌వైర్లు, బ్యాటరీలు చోరీ చేశారని తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన నిందితులు శుక్రవారం గుర్రాలగడ్డ వద్ద ఉండగా వన్‌టౌన్ ఎస్ఐ ప్రతాప్ రెడ్డి సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.70వేలు విలువ చేసే కాపర్‌వైర్లు, రెండు బ్యాటరీలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వారిని రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

9 మంది జూదరుల అరెస్టు

ప్రొద్దుటూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం వివేకానంద క్లాత్‌మార్కెట్ వెనుక కంపచెట్లలో జూదం ఆడుతున్న 9 మందిని అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ సదాశివయ్య, ఎస్ఐ రాఘవేంద్రారెడ్డి తెలిపారు. పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం స్థానిక టూటౌన్ పోలీసు స్టేషన్‌లో పట్టుబడిన జూదరులను చూపెట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రకాష్ నగర్‌కు చెందిన 9మంది జూదరులు పేకాట ఆడుతుండగా పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.84వేల నగదు, 8 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై గ్యాబ్లిం గ్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కోడిపుంజును మింగిన కొండచిలువ



కొండాపురం, నవంబరు 28 (ఆంధ్ర జ్యోతి): స్థానిక సీఆంఆర్ కాలనీలో గురువారం కొండ చిలువ కలకలం రేపింది. స్థానికంగా ఇళ్ల వద్ద ఉన్న కోడిపుంజును పట్టుకొని మింగుతుండగా స్థానికులు గమనించి కొండచిలువను రాళ్లు, కట్టెలతో కొట్టారు. దీంతో కొండచిలువ మృతి చెందింది. కోడిపుంజును వదిలిపెట్టినప్పటికీ అది అప్పటికే మృతి చెందింది. ఈ విషయాన్ని స్థానికులు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా, స్థానికంగా వైరల్ అయ్యింది. పక్కనే గండికోట వెనుక జలాలు ఉండటంతో తరచూ ఇళ్ల వద్దకు ఇలాంటి పాములు వచ్చి చేరుతున్నాయని, స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

కుటుంబం అదృశ్యం

ఎర్రగుంట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల పట్టణంలోని ప్రొద్దుటూరు రోడ్డు కాల్వ కట్ట సమీపంలో చరణ్ డ్రైవింగ్ స్కూల్ నడుపుతున్న నరేష్ తన కుటుంబంతో మూడురోజులుగా కనిపించడం లేదు. నరేష్ తండ్రి ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా... మహాత్మానగర్‌లో నివాసం ఉంటున్న నరేష్ కొంతకాలంగా డ్రైవింగ్ స్కూల్ నడుపుతున్నాడు. అతని ఇంటి పక్కనే తల్లిదండ్రులు కూడా మరో ఇంట్లో నివాసం ఉంటున్నారు. నరేష్‌కు భార్య భార్గవి, కుమారులు చరణ్, శ్రావణ్‌లు ఉన్నారు. బుధవారం నుంచి వారు కనిపించడం లేదని, అత్తగారి ఇంటికి వెళ్లి ఉంటారని అనుకున్నామని, అయితే అక్కడా లేరని, ఫోన్లు కూడా పనిచేయడం లేదని నరేష్ తండ్రి చంద్రాయుడు శుక్రవారం రాత్రి పోలీసులు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నరేష్ కుటుంబంతో సహా కనిపించకుండా వెళ్లడానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై ముగ్గుల పోటీలు

కడప కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవంలో భాగంగా శుక్రవారం జిల్లా వైద్య ఆరో గ్యశాఖ, ఎయిడ్స్ నియంత్రణ శాఖల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ లు, కొవ్వొత్తుల ర్యాలీలు జరిగాయి. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాకాధికారి డాక్టర్ నాగరాజు, జిల్లా అదనపు డీఎం హెచ్‌వో, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ సగిలి రవిబాబు హైరిస్క్ గ్రూపులకు చెందిన వారితో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు డిసెంబరు 1న ఎయిడ్స్ దినం సందర్భంగా బహుమతులు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డెమో భారతి, క్లస్టర్ ప్రోగ్రామ్ అధికారి భాస్కర్, దిశా టీం సభ్యులు, టీబీ యూనిట్, స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రసవత్తరంగా క్రికెట్‌మ్యాచ్‌లు



యాసిన్ సిద్దిక్

కడప స్పోర్ట్స్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య జరుగుతున్న ఏసీఏ అండర్-14 ఇంటర్ జోనల్ క్రికెట్ మ్యాచ్‌లు రసవత్తరంగా సాగుతున్నాయి. కేవోఆర్ఎం మైదానంలో సౌత్‌జోన్ విన్నర్స్, రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో టాస్ నెగ్గిన సౌత్‌జోన్ విన్నర్స్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 48.2 ఓవర్లలో కేవలం 123 పరుగులకే కుప్పకూలిం ది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్ జట్టు మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 41 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 176 పరుగులు చేసింది. ఇందులో విఘ్నేష్ 34 పరు గులతో నాటౌట్‌గా క్రీజ్‌లో ఉన్నారు. దీంతో రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు 53 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత సాధించింది.

ఏసీఏ క్రికెట్ మైదానంలో సెంట్రల్ జోన్ విన్నర్స్ రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్‌జట్ల మధ్య మ్యాచ్ సాగింది. టాస్ నెగ్గిన సెంట్రల్ జోన్ విన్నర్స్ జట్టు బ్యాటింగ్ చేపట్టి మొదటి ఇన్నింగ్స్‌లో 79.3 ఓవర్లలో 235 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఇందులో యాసిన్ సిద్దిక్ 91 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 8 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 19 పరుగులు చేసింది.

కేఎస్ఆర్ఎం మైదానంలో రెస్ట్ఆఫ్ సౌత్ జోన్... రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్ల మధ్య మ్యాచ్ సాగింది. ఇందులో టాస్ నెగ్గిన రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 80.1 ఓవర్లలో 206 పరుగులు చేసి ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 9 ఓవర్లలో 1 వికెట్ నష్టపోయి 12 పరుగులు చేసింది. దీంతో నార్త్ జోన్ జట్టు మరో 194 పరుగుల వెనుకంజలో ఉంది.

జాతీయస్థాయి హాకీ పోటీలకు చరిత



పులివెందుల రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పులి వెందుల శ్రీవిద్యాధరి హైస్కూల్‌కు చెందిన ఎస్.చరిత జాతీ యస్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల సీఈఓ భానుప్రకాష్ తెలిపారు. ఈనెల 22 నుంచి 25వ తేదీ వర కు తిరుపతి జిల్లా చంద్రగిరిలో 69వ స్కూల్ గేమ్స్ ఫెడ రేషన్ అండర్-14 బాలికల హాకీ టోర్నమెంట్‌లో ఎస్.చరిత అద్భుత ప్రతిభ కనబరచడంతో ఆంధ్రప్రదేశ్ అండర్-14 హాకీ జట్టుకు ఎంపికైందన్నారు. డిసెంబరు 22 నుంచి 27వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో జరిగే జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-14 హాకీ టోర్నమెంట్‌లో పాల్గొం టుందన్నారు. విద్యార్థిని ఎంపిక పట్ల పాఠశాల ఉపా ధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

'స్లీప్‌వెల్ బ్రాండ్ అగరబత్తులు వాడవద్దు'



గోడౌన్లను తనిఖీ చేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

మైదుకూరు రూరల్/ పోరుమామిళ్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆషికాష్ కంపెనీకి చెందిన స్లీప్ వెల్ బ్రాండ్ అగరబత్తులలో ప్రాణాంతకమైన పురుగుల మందుల అవశేషాలు ఉన్నాయని, వాటిని వాడకూడదని మైదుకూరు వ్యవసాయ సంచాలకులు క్రిష్ణమూర్తి తెలిపారు. మైదుకూరు పట్టణంలోని పలు నిత్యావసర సరుకుల గోడౌన్లలో వ్యవసాయశాఖ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ అగరబత్తులలో ప్రాణాంతకమైన మేపర్ ఫ్లూత్రిన్ అనే పురుగుల మందుల అవశేషాలు ఉన్నట్లు మెడికల్ ల్యాబ్‌లో నిర్ధారణ అయినట్లు ఆయన తెలిపారు. మండల వ్యవసాయశాఖ అధికారి బాల గంగాధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, పోరుమామిళ్లలోని పలు సూపర్ మార్కెట్లలో వ్యవసాయాధికారులు తనిఖీలు చేశారు. ఆయా దుకాణాల్లో ఆషికాష్ కంపెనీ తయారు చేసే స్లీప్‌వెల్ అగరబత్తుల అమ్మకాలు, వాటి నిల్వలపై తనిఖీలు చేశారు.

పరిశోధన విధానాలపై సమగ్ర అవగాహన అవసరం

కడప ఎడ్యుకేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పరిశోధన విధానాలపై ప్రతి విద్యార్థికి సమగ్ర అవగాహన అవసరమని వరంగల్ ఎన్ఐటీ ఫ్యాకల్టీ రామచంద్రగోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం యోగి వేమన విశ్వవిద్యాలయం రీసెర్చ్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో పరిశోధకుల కోసం నిర్వహించిన రీసెర్చ్ ఓరియెంటేషన్ ప్రోగ్రామ్‌లో పేరెన్నికగన్న నిపుణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కృత్రిమ మేధా ఆధారిత పరిశోధనా సాధనాలపై విశ్లేషణాత్మకంగా మాట్లాడారు. సాహిత్య సమీక్ష, డేటా విశ్లేషణ, థీసిస్ రచనలో ఏఐ ప్రాముఖ్యతను వివరించారు. హైదరాబాద్ నాల్సార్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బుర్రా రాహుల్‌గాంధీ మాట్లాడుతూ రీసెర్చ్ మెథడాలజీపై ప్రాక్టికల్ సెషన్ నిర్వహించారు. పరిశోధనలో ఉపయోగించే సాఫ్ట్‌వేర్‌లు, విశ్లేషణాత్మక గణాంక పద్ధతులను వివరించారు. ఇంటరాక్టివ్ బోధన ద్వారా పరిశోధన రూపకల్పన, గణాంక విశ్లేషణ, ఫలితాల అర్థం చేసుకోవడంలో విద్యార్థులకు స్పష్టత అందించారు.

రైతు ద్రోహి వైఎస్ జగన్

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శశిభూషణ్‌రెడ్డి

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతన్నలను దగా చేసిన ప్రభుత్వం ఏదైనా ఉందంటే.. అది వైసీపీ ప్రభుత్వమేనని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిది వంగల శశిభూషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వైఎంఆర్ కాలనీలోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై 8వ తేదీ రైతాంగ దినోత్సవంగా ప్రకటించిన నాటి వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చి నట్టేట ముంచిందన్నారు. రాయలసీమలో హార్టికల్చరల్ హబ్ ఏర్పాటు చేస్తామని రైతులను నమ్మించి మోసం చేసిందని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో రైతులకు అన్యాయం చేస్తూ 90 శాతంగా ఉన్న డ్రిప్ ఇరిగేషన్ 70 శాతానికి మాత్రమే తగ్గించి ఇచ్చిందన్నారు. ప్రస్తుత ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సన్నకారు, ఎస్సీ రైతులకు నూరు శాతం, రైతులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలను అందించామని తెలిపారు. ధాన్యం కొనుగోలులో వారంలోపు రైతులకు బకాయిలు కూటమి ప్రభుత్వం జమ చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, పి.వి.జయలక్ష్మి, కంబగిరి, వంకధార నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు కాంగ్రెస్ పార్టీలో భగ్గుమన్న విభేదాలు

జమ్మలమడుగు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు కాంగ్రెస్ పార్టీలో విభేదాలు భగ్గుమన్నాయి. గతంలో పాముల బ్రహ్మానందరెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉంటూ కాంగ్రెస్ పార్టీ తరుపున ఎమ్మెల్యేగా పోటీ చేశారు. తర్వాత ముద్దనూరు మండలానికి చెందిన సింగం శివమోహన్‌రెడ్డిని నియమించారు. అప్పటి నుంచి ఆయన అప్పుడప్పుడు కాంగ్రెస్‌పార్టీ అధిష్టానం పిలుపుమేరకు సమావేశాలు నిర్వహించేవారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం జమ్మలమడుగు పట్టణంలోని పతంగే ఫంక్షన్ హాలులో పార్టీ నియోజకవర్గ సంస్థాగత నిర్మాణంపై సభా కార్యక్రమం సింగం శివమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. సమావేశానికి పలు ప్రాంతాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు పాముల బ్రహ్మానందరెడ్డిని స్టేజీపైకి పిలిచి గౌరవించలేదంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. స్టేజీపై ఉన్న నాయకులపైకి ఆరోపణలు చేశారు. తాను మూడుసార్లు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా పోటీ చేశానని, తనను నిర్లక్ష్యం చేశారన్నారు. దీంతో అక్కడున్న నాయకులు జమ్మలమడుగులో ఇన్‌చార్జిగా ఉంటూ నీవు చేసిన ఘన కార్యాలు అందరికీ తెలుసన్నారు.



సమావేశంలో ఒకరిపై ఒకరు తీవ్ర ఆరోపణలు చేసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఇలా మాటా మాట పెరిగి ఒకరిపై ఒక రు ఆరోపణలు చేసుకున్నారు. దీంతో సమావేశం రసాభసాగా మారింది. కార్యక్రమంలో ఎంపీ విజయ్‌వసంత్, డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి, ప్రొద్దుటూరు, పులివెందుల ప్రాంతాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

సీనియార్టీ యథాతథంగా ఉంచాలి

- భూనిర్వాసిత ఉద్యోగులకు అన్యాయం జరిగితే సహించం
- ఆర్టీపీపీ సీఈ వాసుదేవరావుకు వినతి



సీఈ వాసుదేవరావుకు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

ఎర్రగుంట్ల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కలమల్ల వద్ద నున్న డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీకి భూములు కోల్పోయి ఉద్యోగాలు పొందిన వారి సీనియార్టీ యధాతదంగా ఉంచాలని స్థానికులు డిమాండ్ చేశారు. శుక్రవారం వారు ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, ప్రజలతో కలిసి వారు శుక్రవారం ప్లాంట్ సీఈ వాసుదేవరావును కలిసి వినతిపత్రం ఇచ్చారు. 1988లో భూములు కోల్పోయి నిర్వాసితులైన వారికి 2013లో జీవో 98 ఇచ్చి 50శాతం ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. మిగిలిన 50శాతం రిక్రూట్‌మెంట్ ద్వారా నియమించింది. అప్పటి నుంచి భూనిర్వాసితులకు మొదటి ప్రాధాన్యతగా సీనియారిటీ అమల్లో ఉందన్నారు. అయితే తాజాగా సీనియారిటీ జాబితాను మార్పులు చేసి భూములు కోల్పోయిన ఉద్యోగుల సీనియారిటీని వెనక్కి నెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఈ విషయంలో భూనిర్వాసిత ఉద్యోగులకు అన్యాయం జరిగితే పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కలమల్ల, సున్నపురాళ్లపల్లెకు చెందిన కృష్ణబాబు, మణినాథ్‌రెడ్డి, ఐపీఎస్ఆర్, దంతం సుబ్బరామయ్య, ఎస్.తారకరామారెడ్డి, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ గడువు పెంపు

కడప కలెక్టరేట్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడిటేషన్ల కాల పరిమితి ముగుస్తున్న నేపథ్యంలో కార్డుల గడువు మరో 2 నెలలు పెంచుతూ సమాచార పౌరసంబంధాలశాఖ సంచాలకులు కేఎస్ విశ్వనాథన్ శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. నవంబరు 30 వరకు అక్రిడిటేషన్లు గల జర్నలిస్టులకు డిసెంబరు 1 నుంచి వచ్చే ఏడాది జనవరి 31 వరకు లేదా నూతన అక్రిడిటేషన్ కార్డులు జారీ చేసే వరకు ఉత్తర్వులు అమలులో ఉంటాయన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్, డీఎంఏసీ ఛైర్మన్ శ్రీధర్ చెరుకూరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అక్రిడిటే షన్లు కలిగిన సంబంధిత యాజమాన్యాలు ప్రస్తుతం పనిచేస్తున్న జర్నలి స్టుల జాబితాను సమాచార పౌరసంబంధాలశాఖ కార్యాలయంలో అందజేసి పొడిగింపు స్టిక్కర్లను పొందాలని కలెక్టర్ పేర్కొన్నారు.

ఉత్తమ మహిళా టీచర్ ఆచార్య శేష మహేశ్వరమ్మ



అనంతపురం రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): 'ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ - షయోస్తా అక్తర్ మెమోరియల్ నేషనల్ అవార్డు ఫర్ ఇంజనీరింగ్ కాలేజెస్' ఉత్తమ మహిళా టీచర్- 2025కు జేఎన్‌టీయూఏ పులివెందుల ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య శేష మహేశ్వరమ్మ ఎంపికయ్యారు. ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ 55వ జాతీయ వార్షిక అధ్యాపక సదస్సును పురస్కరించుకుని అవార్డులను ప్రదానం చేస్తున్నారు. పుదుచ్చేరిలోని శ్రీ మనకుల వినాయకర్ ఇంజనీరింగ్ కళాశాలలో జరగున్న సదస్సులో అవార్డును అందజేస్తారు. తనకు అవార్డు దక్కడం సంతో షంగా ఉందని ఆచార్య శేష మహేశ్వరమ్మ అన్నారు. ఆమెను వర్సిటీ వైస్ చాన్సలర్ సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య, ఓఎస్‌డీ టు వీసీ ఆచార్య దేవన్న అభినందించారు.

వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజీ స్కాలర్ లక్ష్మీ ప్రవల్లికకు డాక్టరేట్



కడప ఎడ్యుకేషన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయ వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ స్కాలర్ ఆర్.లక్ష్మీప్రవల్లికకు వైవీయూ డాక్టరేట్‌ను ప్రకటించింది. లక్ష్మీ ప్రవల్లిక ఆ శాఖ సహ ఆచార్యుడు డాక్టర్ ఆర్.ప్రదీప్‌కుమార్‌రెడ్డి పర్యవేక్ష ణలో ఎ కాంప్రహెన్సివ్ ఫ్రేమ్ వర్క్ ఫర్ బ్రెయిన్ ట్యూమర్ సెగ్మెంటేషన్ యూజింగ్ ఆప్టిమైజ్డ్ క్లస్టర్ అల్గారిథమ్ అండ్ డీప్ ఎన్కోడర్ - డీకోడర్ ఆర్కిటెక్చర్ విత్ డైస్ లాస్ అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంధాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించారు. ఈ మేరకు విశ్వవిద్యాలయ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కేఎస్వి కృష్ణారావు స్కాలర్ లక్ష్మీప్రవల్లికకు పీహెచ్‌డీ నోటిఫికేషన్‌ను ప్రకటించారు.

'పది' పరీక్షల ఫీజు గడువు పెంపు

పీలేరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మార్చిలో జరగనున్న పదో తరగతి పరీక్షల ఫీజు చెల్లింపు గడువు పెంచినట్లు డీసీఈబీ కార్యదర్శి తాటిపర్తి గంగాధరం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 6వ తేదీ వరకు సాధారణ రుసుము, 9వ తేదీ వరకు రూ.50 ఆలస్య రుసుము, 12వ తేదీ వరకు రూ.200, 15వ తేదీలోపు రూ.500 ఆలస్య రుసుముతో చెల్లించవచ్చునని ఆయన తెలిపారు. ఈ విషయాన్ని జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు గమనించి గడువు చివరి తేదీ వరకు వేచి ఉండకుండా బీఎస్ఈ.ఏపీ.జీవోవీ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ పేమెంట్ చేయాలని సూచించారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

గుర్రంకొండ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జూదరులపై పోలీసులు దాడులు నిర్వహించి ఐదుగురిని శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. మండలంలోని తరిగొండ సమీప పొలాల్లో జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడులో ఐదుగురు జూదరులు పట్టుబడగా వారి వద్ద నుంచి రూ.50,750 నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వాహనం ఢీకొని యువకుడికి గాయాలు

మదనపల్లె అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం నక్కలదిన్నెకు చెందిన చంద్రానాయక్ కుమారుడు కుళ్లాయి నాయక్ (28) నిమ్మనపల్లె రోడ్డులో బైక్‌పై వెళుతుండగా టాటాఏస్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో యువకుడు గాయపడగా వెంటనే స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఈ మేరకు తాలుకా పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

నిమ్మనపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తీవ్ర తుపాన్ పొంచి వుందన్న వాతావరణశాఖ ప్రకటనతో మండల రైతులు రెండు రోజుల పాటు అప్రమత్తంగా ఉండాలని ఏవో మంజుల తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ శని, ఆదివారం రెండు రోజల పాటు తీవ్రతుపాన్ ప్రభావం ఉంటుందని, రైతులు వరి కోతలను వాయిదా వేసుకొవాలని తెలిపారు. ముదస్తు చర్యలు తీసుకొని తుఫాన్ ప్రభావం నుండి పంట నష్టాన్ని నివారించుకోవాలని తెలిపారు.

ప్రారంభమైన పడిపూజ కార్యక్రమాలు

మదనపల్లె అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): చిప్పిలి గ్రామంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం పడిపూజ కార్యక్రమాలు ప్రారంభమైనట్లు ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ మార్పూరి సుధాకర్ నాయుడు తెలిపారు. సాయంత్రం కేరళ రాష్ట్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ప్రధాన తంత్రి మనోజ్‌స్వామితో పూజ కార్యక్రమాలు మొదలయ్యాయని, ఇందులో భాగంగా భగవతి సేవ నిర్వహించారు. అయ్యప్పస్వామిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు జర్మనీ రాజు, శివమూర్తి,ఆనందనాయుడు, భగవాన్, వేణుగోపాల్, ముద్దుకృష్ణ, రవి, యోగి, నాగరాజు, బీజేపీ నేత వరదారెడ్డి నారధ రెడ్డి, బోర్‌వెల్ సుధాకర్ పాల్గొన్నారు.

వృద్ధులకు స్వెటర్ల పంపిణీ

మదనపల్లె అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అమ్మచెరువు మిట్టలోని వెలుగు వృద్ధాశ్రయంలో శుక్రవారం వృద్ధులకు స్వెటర్లు పంపిణీ చేసినట్లు ఆ సంస్థ సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తల్లి విమలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని వృద్ధులకు చలికాలం నేపథ్యంలో స్వెటర్లు పంపిణీ చేశామన్నారు. అనంతరం ఆశ్రమంలో విమలమ్మకు నివాళులర్పించారు. కార్యక్రమంలో కన్వీనర్ భాగ్యలక్ష్మి, ఈసీ మెంబరు సుజాత, ప్రిన్సిపాల్ లీలాకుమారి, స్వీటీ తదితరులు పాల్గొన్నారు.



స్వెటర్లు అందిస్తున్న ఉదయ్‌మోహన్‌రెడ్డి

సామాజిక విప్లవకారుడు పూలే



జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బాస్ నేత ముత్యాల మోహన్

మదనపల్లె, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కులవ్యవస్థకు వ్యతిరేకంగా, అణచివేతకు గురవుతున్న ప్రజల్లో ఆత్మస్థైర్యం నింపిన సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని బాస్ అధినేత పీటీఎం శివప్రసాద్, రాష్ట్ర అధికార ప్రతినిధి ముత్యాల మోహన్ కొనియాడారు. స్థానిక కాలనీ గేట్‌లో శుక్రవారం జ్యోతిరావు పూలే వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బాస్ టౌన్ కన్వీనర్ గంగాధర్, పెద్దపాళెం రవిశంకర్, జి.వెంకటరమణ, తలారి కృష్ణ, బడికాయల నరసింహ, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జ్యోతిరావు పూలే వర్ధంతి

మదనపల్లె అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక నీరుగట్టువారిపల్లెలోని జ్యోతిరావుపూలే విగ్రహానికి శుక్రవారం బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బోడెం రాజశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల విద్య కోసం ప్రథమంగా పాఠశాలలను ఏర్పాటు చేసి సమాజంలో మహిళలకు గుర్తింపు తెచ్చారన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బీహెచ్‌పీఎస్ నాయకులు వైవీ శేఖర్ నాయుడు, రామలింగయ్య, చిన్నరెడ్డెప్ప, కరామత్ బాషా, సుబ్బరాజు, బి రమణ, చౌడం రామాంజలు, శేషాద్రి నాయుడు, లక్ష్మీ నారాయణ, రామకృష్ణ, సిద్దయ్య, మల్లిక, రేఖా, సుబ్రమణ్యం, శ్రీనివాసులు, దామోదర్ రాజా, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో..

బీసీల ఆరాధ్యదైవం జ్యోతిరావు పూలే అని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి ఓసూరి కిరణ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి పులి నరేంద్రకుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మదనపల్లె పట్టణం నీరుగుట్టువారిపల్లెలోని పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజానికి పూలే చేసిన సేవలు అందరికీ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కిరణ్ కుమార్, రామిరెడ్డిగారిపల్లె తరిగొండ వెంకటరమణా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పీలేరులో...

పీలేరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతిని శుక్రవారం పీలేరులోని పలు కార్మిక, ప్రజా, విద్యార్థి, దళిత, ఉద్యోగ సంఘాలు ఘనంగా నిర్వహించాయి. పీలేరు మార్కెట్ కమిటీ వద్ద నున్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించాయి. ఈ సందర్భంగా బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు బలరాం మాట్లాడుతూ అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు స్త్రీ విద్య సమాజానికి వెలుగునిస్తుందని గ్రహించి బాలికల పాఠశాలలను నెలకొల్పిన దార్శనికుడు పూలే అన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు నేత ధరణీకుమార్, బాస్ నేత పాలకుంట శ్రీనివాసులు, బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ నాయకులు ప్రభాకర్ రాజు, షణ్ముగం, రామయ్య, చెంగ్రాయులు, రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.




జ్యోతిరావు పూలే వర్ధంతి పురస్కరించుకుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పింస్తున్న బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్, బీజేపీ నాయకులు



పీలేరులో జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న 'పార్స్' నేతలు

ఎమ్మెల్యే నల్లారి చొరవతోనే పీలేరు రెవెన్యూ డివిజన్



మాట్లాడుతున్న సింగిల్ విండో చైర్మన్ రెడ్డెప్పరెడ్డి

పీలేరు రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్‌గా పీలేరు ఏర్పాటులో తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపారని సింగిల్ విండో అధ్యక్షుడు, ఏఎంసీ డైరెక్టర్ గోళ్ల కిషోర్‌నాయుడు తెలిపారు. శుక్రవారం పీలేరు సింగల్ విండో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు మదనపల్లెను జిల్లా చేస్తామన్న హామీ నెరవేర్చారని, అలాగే మదనపల్లె జిల్లా అయితే పీలేరును రెవెన్యూ డివిజన్‌గా చేయిస్తానని ఎమ్మెల్యే నల్లారి ఇచ్చిన హామీ నెరవేర్చారని తెలిపారు. రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతో పీలేరు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ఈ ప్రాంత ప్రజల భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అగ్రహారం సర్పంచ్ నాగప్పగారి బొజ్జిరెడ్డి, సింగల్ విండో డైరెక్టర్లు పుల్లయ్య, అమానుల్లా, వరంపాటి బాబురెడ్డి, అమర్నాధరెడ్డి, వెంకట్రమణారెడ్డి, చంద్రయ్య, అబ్బారపు శ్రీనివాసులు, జనార్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని వినతి

- మంత్రులను కలసిన మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరాం



మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డితో మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివరామ్, రామ్‌దాస్‌చౌదరి

మదనపల్లె, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మదనపల్లె వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి నిధులు మంజూరు చేసి సహకరించాలని మార్కెట్ కమిటీ చైర్మన్ జంగాల శివ రామ్ కోరారు. శుక్రవారం విజయవాడలో వ్యవసాయ, పశుసంవర్ధక, సహకారశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మార్కెట్ అభివృద్ధికి తాము చేపడుతున్న ప్రణాళికలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి, అందుకు సహకరించాలని, మార్కెట్‌ను సందర్శించాలని మంత్రిని కోరారు. అలాగే జనసేన రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామ్‌దాస్ చౌదరితో కలసి రోడ్లు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా మదనపల్లె జిల్లాలోని నియోజకవర్గాలకు జనసేనకు కేటాయించాల్సిన పదవులపై దృష్టి పెట్టాలని కోరారు. మంత్రులను కలసిన వారిలో జనసేన నాయకులు పోతుల సాయినాథ్, చిన్నా రాయల్, దినేష్, తోట కళ్యాణ్, లక్ష్మినారాయణ, గణేష్, హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

సేవారత్న అవార్డు గ్రహీతకు ఘన సన్మానం



వెలుగు సంస్థ సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు

మదనపల్లె అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఉత్తమ సేవలకు ఢిల్లీలో అవార్డు అందుకున్న వెలుగు సేవా సంస్థ సెక్రటరీ ఉదయ్ మోహన్‌రెడ్డిని శుక్రవారం మదనపల్లె రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్షుడు కనుగొండ మద్దిరెడ్డి మాట్లాడుతూ చాలా ఏళ్లుగా బదిరిలకు, వృద్ధులకు , వికలాంగులకు సేవలు అందిస్తున్న ఉదయ్‌మోహన్‌రెడ్డి సేవా రత్న అవార్డును అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. మరిన్ని అవార్డులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కంభం నిరంజన్‌రెడ్డి, దేవేంద్రరెడ్డి, ప్రసాదరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఉదయారెడ్డి, రామమోహన్‌రెడ్డి, రాజారెడ్డి, మల్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి ఇష్టం లేక యువతి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పెళ్లి అంటే ఇష్టం లేని ఓ యువతి విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం రాత్రి వాల్మీకిపురం మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని వాల్మీకిపురం వడ్డిపల్లెకు చెందిన చిన్నప్ప తన కూతురు శిరీష(20)కు వివాహం చేయదలచి పెళ్లిచూపుల కోసం శుక్రవారం ఓ గ్రామానికి చెందిన పెళ్లికొడుకు, వారి కుటుంబ సభులతో ఇంటికి ఆహ్వానించారు. కానీ తనకు ఇప్పుడే పెళ్లి వద్దని శిరీష పెద్దలకు చెప్పినా వారు ఒత్తిడి చేయడంతో మనస్తాపానికి గురై పురుగులు మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే వాల్మీకిపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఇక్కడ ప్రథమ చికిత్స అందించిన డాక్టర్లు మెరుగైన వైద్యంకోసం తిరుపతి రుయాకు రెఫర్ చేశారు.

బంగారు ఆభరణాలపై రుణ సౌకర్యం

- డీసీసీబీ మేనేజర్ విజయకుమారి

పీలేరు రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పీలేరు సింగల్ విండో కార్యాలయంలో ఇకపై బంగారు ఆభరణాలపై రుణాలు పొందవచ్చునని డీసీసీబీ మేనేజర్ విజయకుమారి, సింగల్ విండో చైర్మన్ రెడ్డెప్పరెడ్డి తెలిపారు. శుక్రవారం పీలేరులో ఖాతాదారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయేతర అవసరాలపై 10.5 శాతం వడ్డీతో రూ.40లక్షల వరకు రుణం తీసుకోవచ్చునని తెలిపారు. ఖాతాదారులకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించడం కోసం ఆకర్షణీయమైన వడ్డీరేట్లతో పాటు అనేక కొత్త పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. సహకార బ్యాంకు జిల్లాలోని అన్ని పంచాయతీలు, మున్సిపాలటీలు, కార్పొరేషన్లలో ఇంటి రుణాలు పొందవచ్చునని, వ్యాపార అవసరాల కోసం రూ.50 వేల నుంచి రూ.3లక్షలు, స్వయం సహాయక గ్రూపుల సీనియారిటీ ఆధారంగా రూ.3 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు పొందవచ్చునని తెలిపారు. సమావేశంలో కల్లూరు డీసీసీబీ మేనేజర్ రెడ్డిసులోచన, డైరెక్టర్లు పుల్లయ్య, అమానుల్లా, పలువురు ఖాతాదారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ వై. రెడ్డెప్పరెడ్డి

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సర్వేలో పాల్గొన్న నియోజకవర్గ ప్రత్యేక అధికారి వెంకటరత్నం, ఎంపీడీవో

కురబలకోట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని నియోజకవర్గ ప్రత్యేక అధికారి వెంకటరత్నం, ఎంపీడీవో గంగయ్య పేర్కొన్నారు శుక్రవారం మండలంలోని కురబలకోటలో జరిగిన రైతన్న-మీ కోసం కార్యక్రమంలో ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు లాభసాటి వ్యవసాయం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వ్యవసాయ రంగం అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అనంతరం కరపత్రాలను అందజేశారు.

ఎన్నికల నిర్వహణలో బీఎల్వోల పాత్ర కీలకం

పెద్దతిప్పసముద్రం నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిర్వహణలో బీఎల్వోలదే కీలకపాత్ర అని తహసీల్దార్ శ్రీరాములునాయక్ తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్వోలు ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్ల నమోదులో ఎటువంటి ఆలసత్వం వహించినా ఆ బీఎల్వోలదే బాధ్యత అన్నారు. ఆయా పోలింగ్ కేంద్రంలో ఓటర్ల నుండి వచ్చే వివిధ సమస్యలపై బీఎల్వోలు ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలన్నారు. స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీఎల్వోలు అప్రమత్తంగా ఉండి ఓటర్ల ప్రక్రియను వేగవంతం చేసి ఓటర్లకు అందుబాటులో ఉండాలన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి

తంబళ్లపల్లె, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రతా నిబంధనలు తప్పక పాటించాలని ఎస్ఐ ఉమామహేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆటోడ్రైవర్లకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. ఆటోలను రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ నిలపకుండా నిర్దేశిత స్థలంలో మాత్రమే నిలపాలని సూచించారు. రోడ్డు భద్రతా నిబంధనలు ఉల్లంఘించి ఆటోలు నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ నజీర్ బాష, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

అధికారుల విధులు తెలుసుకోవాలి

పెద్దమండ్యం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారుల విధుల గురించి విద్యార్థులు తెలుసుకోవాలని ప్రధానోధ్యాయుడు జనార్థనరెడ్డి అన్నారు. మండలంలోని పాపేపల్లి పంచాయతీ గురివిరెడ్డిగారిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రభుత్వం అనే పాఠంపై సరళ బోధనకు శుక్రవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. మండల స్థాయిలో ప్రభుత్వాధికారుల పని తీరు, విధులపై తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం, ప్రభుత్వాసుపత్రి, గ్రామసచివాలయం, ఎమ్మార్సీ కార్యాలయాలతో పాటు పోలీసుస్టేషన్‌లను సందర్శించారు. అక్కడి అధికారుల విధులు, విధానాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ తేజస్వి, ఎంపీడీవో శ్రీధర్‌రావు, డాక్టర్ హరివర్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మదనపల్లె టౌన్/పీలేరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మదనపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా వున్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో నాగవేణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మదనపల్లె రూరల్‌లో కోటగుండ్లపల్లె, నిమ్మనపల్లె మండలం దేవళం కురపల్లెలో అంగన్‌వాడీ కార్యకర్త, మదనపల్లె అర్బన్‌లోని చలపతిరావుకాలనీ, రాంనగర్, బసినికొండ కాలనీ, మదనపల్లె రూరల్‌లోని రెడ్డివారిపల్లె, కురవపల్లె, మిట్టపల్లె, రామసముద్రం మండలంలోని ఆర్.కమతంపల్లె, కొండూరు అంగన్‌వాడీ సెంటర్లలో సహాయకురాలి పోస్టులు ఖాళీగా వున్నాయన్నారు.

పీలేరు ప్రాజెక్టు పరిధిలో..

పీలేరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పీలేరు ప్రాజెక్టు పరిధి కలకడలోని ఈబీ కాలనీ(ఓసీ-ఈడబ్ల్యుఎస్), కలకడ-2(ఓసీ), కలకడ మండలం సింగనొడ్డిపల్లె(బీసీ-బీ), పాపిరెడ్డిగారిపల్లె(ఎస్టీ), డి.బాటవారిపల్లె(ఓసీ), కేవీపల్లె మండలం గ్యారంపల్లె(బీసీ-సీ), వంగిమళ్లవారిపల్లె(ఎస్సీ), పీలేరు మండలం ముడుపులవేముల(పీహెచ్‌సీ-వీహెచ్), అయ్యప్పరెడ్డి కాలనీ(ఎస్సీ) అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఐసీడీఎస్ సీడీపీవో రాజమ్మ తెలిపారు.

బి.కొత్తకోట ఐసీడీఎస్ పరిధిలో..

బి.కొత్తకోట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న నామాలపల్లి బీసీ-సీ, సీ.కొత్తపల్లి బీసీ-ఏ, కనుగొండవారిపల్లి బీసీ-డీ, ములకలచెరువు ఆర్‌యస్-ఎస్సీ, కదిరినాధునికోట బీసీ-బీ, గండాలవారిపల్లి ఎస్సీ, బూర్లపల్లి-1 ఓసీ స్థానాల్లో అంగన్వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో భాగ్యమ్మ తెలిపారు.

తంబళ్లపల్లె పరిధిలో..

తంబళ్లపల్లె, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ కార్యకర్త, హెల్పర్ పోస్టుల భర్తీకి అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్వాడీ హెల్పర్ పోస్టులు తంబళ్లపల్లె మండలంలో మర్రిమాకులపల్లె(వీహెచ్), మూలపల్లె (బీసీ-సీ), అప్పమ్మగారిపల్లె(బీసీ-డీ), గంగిరెడ్డిపల్లె (బీసీ-బీ), పెద్దమండ్యం మండలంలో గుడిసివారిపల్లె (ఓహెచ్), బండకిందతాండా(ఎస్టీ), మందలవారిపల్లె(ఎస్సీ), కలిచెర్ల-2(బీసీ-బి), కురబలకోట మండలంలో దాదంవారిపల్లె(ఎస్సీ), ముదివేడు(ఎస్సీ), నందిరెడ్డిగారిపల్లె(హెచ్‌హెచ్) ఖాళీలున్నట్లు తెలిపారు. అలాగే పెద్దమండ్యం మండలం ముసలికుంట-2 అంగన్వాడీ కేంద్రంలో కార్యకర్త (వీహెచ్) పోస్టు ఖాళీ ఉన్నట్లు తెలిపారు. 21సంవత్సరాలు నిండి 35 ఏళ్ల లోపు వయస్సు కలిగి, పదవ తరగతి పాసై, వివాహితులై స్థానిక నివాసం వున్న మహిళలు మాత్రమే అర్హులని, ఆసక్తిగల అభ్యర్థులు డిసెంబరు 7వ తేదీలోపు ఆయా ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల్లో దరఖాస్తులను అందించాలని సూచించారు.

యూటీఎఫ్ మండల కమిటీ ఏకగ్రీవం



విశ్వనాథరెడ్డి, మండల అధ్యక్షుడు



సుధాకర్, ప్రధాన కార్యదర్శి

పీలేరు రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ పీలేరు మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి, జిల్లా సహాధ్యక్షుడు ఎస్.శివారెడ్డి తెలిపారు. శనివారం పీలేరులో జరిగిన యూనియన్ సమావేశంలో పీలేరు మండల అధ్యక్షుడిగా ఆవు విశ్వనాథరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, మండల గౌరవాధ్యక్షుడిగా రెడ్డెప్ప, అలాగే మిగతా సభ్యులను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక బకాయిలు సకాలంలో చెల్లించాలని, యాప్‌ల భారం తగ్గించి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని, తద్వారా ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయన్నారు.

మాతృత్వానికి మరో మార్గం దత్తత



దత్తతపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డ్వాక్రా మహిళలు

పీలేరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మాతృత్వం పొందడానికి దత్తత మరో మార్గమని వెలుగు పథకం డీపీఎం ధర్మరాజు అన్నారు. అంతర్జాతీయ దత్తత అవగాహన మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం పీలేరులోని మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో దత్తతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథలు, వదిలి వేయబడిన పిల్లలు, అప్పగించబడిన పిల్లలను ప్రభుత్వ అనుమతితో దత్తత తీసుకుని మాతృత్వాన్ని పొందవచ్చునన్నారు. జిల్లా శిశు గృహ దత్తత విభాగం మేనేజర్ సుప్రియ దత్తత ప్రక్రియ, దత్తత తీసుకోదలచిన తల్లిదండ్రులు సమకూర్చుకోవాల్సిన పత్రాల గురించి అవగాహన కల్పించారు. ఎవరైనా అనధికారికంగా దత్తత తీసుకుని ఉంటే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌ను సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం జవహర్, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

మదనపల్లె జిల్లా ప్రకటనపై సంబరాలు

నిమ్మనపల్లె, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మదనపల్లె జిల్లా ప్రకటనపై మాజీ సర్పంచ్ మల్లికార్జున, మాజీ ఎంపీపీ రెడ్డెప్పరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని వెంగంవారిపల్లి పంచాయతీ బాలినాయునిపల్లిలో గ్రామస్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఎన్నికల హామీల్లో మదనపల్లెను జిల్లాగా చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ ఫలించిందన్నారు. మదనపల్లె అన్ని రంగాల్లో అభివృద్ధి చెంది పరిశ్రమలు వచ్చి నిరుద్యోగ సమస్య తీరుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శంకరయ్య, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మదనపల్లె జిల్లా పేరుతో వున్న కేకు



మదనపల్లె జిల్లా ప్రకటనపై సంబరాలు చేసుకొంటున్న ప్రజలు